మానేరు జనత
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక



## మహా గణపతీమ్ మనసా స్మరామి

# గంగమ్మ ఒడికి.. గణనాథుడు...

### కోలాహలంగా గణనాథుని నిమజ్జనాలు..

అంగరంగ వైభవంగా పూర్తయిన నవరాత్రోత్సవాలు

వైభోవపేతంగా గణనాథుల శోభయాత్ర

ప్రత్యేకార్షణగా ప్యారిస్ లైన్ గణపతి శోభయాత్ర

శోభయాత్రకు భారీగా తరలివచ్చిన ప్రజలు





నవరాత్రులు వైభవంగా పూజలందుకున్న గణనాథుడు సోమవారం గంగమ్మ ఒడికి చేరాడు.కరీంనగర్ పట్టణంలో గణనాథుని నిమజ్జనాన్ని నిర్వహాకులు అంగరంగా వైభవంగా నిర్వహించారు.నిష్టతో ప్రత్యేకంగా పూజలు చేసిన భక్తులు గణనాథుని శోభయాత్రకు భారీగా తరలివచ్చి విక్షించారు.అయా మండపాల్లో గణనాథుని దర్శనానికి భక్తులు తరలివచ్చి భారులు తీరారు.దీంతో నిమజ్జనం రోజు మండపాలు భక్తులతో కిటకిటలాడాయి.పురోహితులు నిర్వహించిన ప్రత్యేక పూజలకు భక్తులు అత్యధికంగా పాల్గొన్నారు.దీంతో కరీంనగర్ పట్టణంలోని అడపడుచుల దండియా కోలాటాలు,డీజే సౌండ్లతో మారుమ్రోగి కోలహలంగా గణనాథుని శోభయాత్ర నూతన శోభను సంతరించుకుంది.పోలీస్ పటిష్టమైన భద్రత,ఫహేర మద్య గణనాథులు నిమజ్జనానికి మానకొండూర్ చెరువుకు శోభయాత్రగా భయలుదేరి..గంగమ్మ ఒడిలోకి చేరారు.










# అత్యంత భక్తి శ్రద్ధలతో నిమజ్జనోత్సవం..

### కరీంనగర్ టవర్ సర్కిల్ వద్ద నెం.1 గణ నాథునికి..ప్రత్యేక పూజలు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్–జనత న్యూస్ : గణేశ్ నిమజ్జనోత్సవాలు అత్యంత భక్తి శ్రద్దలతో కొనసాగుతున్నాయి. నగరంలోని ఆయా మండపాల నుండి శోభాయాత్ర ను ప్రారంభించిన భక్తులు డప్పు చప్పుళ్లు, నృత్యాల మధ్య టవర్ సర్కిల్ గుండా మానకొండూర్ చెరువు వరకు వెళ్లి నిమజ్జనం చేస్తున్నారు. వేడుకల్లో భాగంగా నగరంలోని టవర్ సర్కిల్ వద్ద 1వ నెం. విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు కేంద్ర మంత్రి బండి సంజయ్. జిల్లా కలెక్టర్ పమేల సత్పతి, మేయర్ సునిల్ రావు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు

మిగతా 2 లో









## నేడు ప్రజాపాలన దినోత్సవం

### కరీంనగర్‌లో మంత్రి శ్రీధర్ బాబు, సిరిసిల్లలో విప్ ఆది శ్రీనివాస్..

### జాతీయ జెండా ఆవిష్కరణ.. వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

కరీంనగర్/సిరిసిల్ల–జనత న్యూస్ : సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆయా జిల్లాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు అధికారులు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు హాజరు కానున్నారు. తొలుత అమర వీరుల స్థూపం వద్ద ఆయన నివాళ్లు అర్పించిన అనంతరం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొంటారు. జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసు వందనం, జాతీయ, తెలంగాణ

మిగతా 2 లో

# హామీల డైవర్షన్స్ కోసమే..

- రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు
- కేసీఆర్ కుటుంబానికిచ్చేందుకే కేజ్రీవాల్ రాజీనామానా..?
- విమోచన దినోత్సవం నిర్వహిస్తే పాల్గొంటా..
- మోదీ బర్త్ డేకు విస్తృతంగా సేవా కార్యక్రమాలు
- కేంద్ర మంత్రి బండి సంజయ్



కరీంనగర్-జనత న్యూస్ : ఆరు గ్యారెంటీలు అమలు చేయలేక డైవర్షన్ కోసం రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండి పడ్డారు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్. కరీంనగర్‌లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎవరికి భయపడి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించడం లేదని ప్రశ్నించిన బండి సంజయ్..తాము పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే విమోచన వేడుకకు హాజరు కావాలని ప్రభుత్వ పెద్దలను కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సర్దార్ వల్లాభాయ్ పటేల్ తమకు వీరుడే నని..బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే హైదరాబాద్‌లో సర్దార్ వల్లాభాయ్ పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. సీఎం పదవికి కేజ్రీవాల్ రాజీనామాపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు బండి సంజయ్. ఇక్కడ కేసీఆర్ కుటుంబం ఖాళీగా ఉందని, వారికి సీఎం పదవి ఇచ్చేందుకే ఢిల్లీ సీఎం పదవికి కేజ్రీవాల్ రాజీనామా చేస్తున్నారా..అని ఎద్దేవ చేశారు. తెలంగాణప్రజా పాలన దినోత్సవం దేనికోసం నిర్వహిస్తున్నారని ప్రశ్నించిన బండి సంజయ్..విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తే తాను హాజరౌతానని చెప్పారు. వారికి చేతకాకుంటే కేంద్రం పరేడ్ గ్రౌండ్ లో అధికారికంగా నిర్వహిస్తున్న 'తెలంగాణ విమోచన దినోత్సవానికి' హాజరు కావాలని సీఎంను కోరారు. హిందువుల పండుగలపై వివక్ష చూపుతున్నారనే భావన ప్రజల్లో ఉందని.. దాన్ని తొలగించేలా ప్రభుత్వం వ్యవహరించాలని సూచించారు. భగవన్ విశ్వకర్మ జయంతి సందర్భంగా విశ్వకర్మలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కరీంనగర్ లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాన్ని దర్శించుకుని వారు నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. హుస్సేన్ సాగర్ లో గణేశ్ నిమజ్జనం జరిపే విషయమై భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించి ప్రజలకు అనుకూలమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు..

### రోటరీ క్లబ్ సేవలను అభినందించిన కేంద్ర మంత్రి



కరీంనగర్-జనత న్యూస్ : చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను అందజేశారు రోటరీ క్లబ్ ప్రతినిధులు. కరీంనగర్ చైతన్యపురి కాలనీ మహాశక్తి ఆలయంలో క్లబ్ ప్రతినిధులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను ఆయన పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ కు ప్రత్యేకత ఉందని కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని రోటరీ క్లబ్ కరీంనగర్ , రోటరీ క్లబ్ మొయినాబాద్ సహకారంతో పది తోపుడు బండ్లను వీధి వ్యాపారులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ వీధి వ్యాపారులతో మాట్లాడారు. రోజువారి ఆదాయం ఎలా ఉంటుంది, మీ కుటుంబ పోషణ సరిపోతుందా..? అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోటరీ క్లబ్ అందించిన తోపుడు బండిని కుటుంబ పోషణకు ఉపయోగించుకోవాలని సూచించారు. అలాగే ఇంజనీర్స్ డే ను పురస్కరించుకొని ఇంజనీర్ లు జీవి కిషన్, పవన్ కృష్ణ, కిరణ్ కుమార్, అరవింద్, రామేందర్, రాజశేఖర్ లను కేంద్రమంత్రి బండి సంజయ్ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆనంద్, రోటరీ క్లబ్ కరీంనగర్ అధ్యక్షుడు వెంకట కిషన్, కార్యదర్శి పాక పవన కృష్ణ, మాజీ కార్పొరేటర్ చీటీ రామారావు, రామ్ మోహన్ రావు, ఆనంద్ కుమార్, పసుల తిరుపతి, ప్రభాకర్ రావు, చందర్ లక్ష్మీనారాయణ ,ఆంజనేయులు ,రాజేందర్, తిరుపతి, రోటరీ క్లబ్ బాధ్యులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన వేడుకలను పర్యేక్షించిన జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్



జగిత్యాల, జనతా న్యూస్: గణేష్ నిమజ్జనం వేడుకలను పురస్కరించుకుని మెట్పల్లి పట్టణంలో జరుగుతున్న నిమజ్జన వేడుకలను సోమవారం రోజున జిల్లా కలెక్టర్, ఆర్డీవో శ్రీనివాస్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మెట్పల్లి లోని నిమజ్జన జరుగుతున్న వాగు ని పరిశీలించిరు. అనంతరం నిమజ్జనానికి ఏర్పాటు చేసిన ఏర్పాట్లులను,సీసీ టీవీ ఎల్ఈడి స్క్రీన్ లను , మరియు వాగు లో నిమజ్జనం అవుతున్న విగ్రహాలు పరిశీలించారు. ఫస్ట్ ఎయిడ్ కిట్లు, త్రాగునీరు అందుబాటులో సూచించారు. మున్సిపల్ అధికారులు పోలీస్ శాఖ సిబ్బంది సమన్వయం చేసుకుంటూ అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని, ఎలాంటి అవాంఛనాలు జరగకుండా ఎప్పటికప్పుడు పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో, ఆర్డీవో శ్రీనివాస్, డిఎస్పీ, మున్సిపల్ అధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు.

## హుజురాబాద్ లో.. ఘనంగా మాజీ ఎంపీ స్వర్గీయ సింగాపురం రాజేశ్వర్ రావు జయంతి వేడుకలు



హుజురాబాద్ సెప్టెంబరు 16 జనతా న్యూస్ : కాంగ్రెస్ పార్టీ దిగ్గజం, మాజీ ఎంపీ స్వర్గీయ వొడితల రాజేశ్వర్ రావు 93వ జయంతి వేడుకలు హుజురాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్ లోని స్వర్గీయ రాజేశ్వర్ రావు విగ్రహానికి పూలమాలలు వేసి పలువురు నేతలు నివాళులర్పించారు. ఆయన కుమారులు కిషన్ రావు, శ్రీనివాస రావు, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ బాబు, కుటుంబసభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హుజురాబాద్ ప్రాంతానికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. పేదల పక్షాన నిలబడి వారికి కనీస అవసరాలు తీర్చడానికి ప్రయత్నం చేశాడని, గల్లీ నుండి ఢిల్లీ వరకు అందరితో కలిసి హుజురాబాద్ అభివృద్ధికి తనవంతు కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. తాత ఆశయాలను కొనసాగిస్తూ, ప్రజలకు సేవ చేయడంలో ప్రణవ్ ముందు ఉంటున్నారని, రాబోయే కాలంలో హుజురాబాద్ ప్రజలకు ప్రణవ్ మరింత సేవ చేస్తారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే సతీష్ బాబు మాట్లాడుతూ.. హుజురాబాద్ ప్రాంతానికి రాజేశ్వర్ రావు సేవలు మరువలేనివని, వ్యవసాయ ఆధారిత ప్రాంతం అయినందున ఇక్కడి రైతుల అవసరాలకు గుర్తించి ఆనాడే పివి సహకారంతో కాకతీయ కాలువ ఈ ప్రాంతానికి రావడానికి కృషి చేశారని, ద్వారా హుజురాబాద్ ప్రాంతం సస్యశ్యామలంగా ఉందని అన్నారు. తాగునీటి సమస్యల బారిన పడకుండా ఉండేందుకు మంచినీటిని ఇంటి ఇంటికి అందించేందుకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి సుమారు రూ.8 కోట్లు ఆనాడే మంజూరు చేయించి 33 గ్రామాలకు మంచినీటి సరఫరా కోసం కృషి చేశారని అన్నారు. ఆయన అడుగు జాడల్లో నడుస్తూ వారి ఆశయాలను కుటుంబ సభ్యులుగా ముందుకు తీసుకు వెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.


## గణేశ్ నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు..

### సీసీ కెమెరాల పర్యవేక్షణలో శోభాయాత్ర

ప్రధాన చోట్ల రూఫ్ టాప్ బందోబస్త్ ఏర్పాటు.. అధికారులకు కరీంనగర్ సీపీ సూచనలు



కరీంనగర్-జనత న్యూస్ : కరీంనగర్ లో జరిగే గణేశ్ నిమజ్జనానికి పోలీసు శాఖ పటిష్ట ఏర్పాట్లు చేసింది. పోలీసు కమీషరేట్ కేంద్రంలోని జాన్ విల్సన్ హాలు లో గణేష్ నిమజన బందోబస్తుపై అధికారులకు కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి పలు సూచనలు చేసారు. నిమజ్జన కేంద్రాలయిన మానకొండూరు చెరువు , చింతకుంట కెనాల్ , కొత్తపల్లి చెరువులతో పాటు , గణేష్ శోభాయాత్ర జరిగే రూట్ లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి స్థాయిలో బందోబస్తు ఏర్పాట్లు పూర్తిచేశామని పేర్కొన్నారు. నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద మరియు ఇతర ముఖ్యమైన చోట్ల పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, పోలీస్ కంట్రోల్ రూమ్ ద్వారా వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. సున్నితమైన ప్రాంతాల్లో రూఫ్ టాప్ లో సైతం బందోబస్త్ ఏర్పాటు చేశామని తెలిపారు. అధికారులు మరియు సిబ్బంది అంతా నిమజ్జన కార్యక్రమం ముగిసే వరకు అప్రమత్తంగా వుంటూ విధులు నిర్వహించాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం జరిగేలా పోలీస్ పరంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎవరైనా పోలీసులు జారీచేసిన నియమాలు ఉల్లంఘించి ప్రజా శాంతికి భంగం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ శాంతి భద్రతలు ఎ లక్ష్మీనారాయణ , ఏసీపీ లు శ్రీనివాస్ (సి. ఎస్. బి.), నరేందర్ (టౌన్), కాశయ్య , మాధవి , విజయ్ కుమార్ ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## ఎల్ఎండీకి పర్యాటక శోభ

### గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

### పర్యాటకులను కనువిందుకు చేస్తున్న దృష్యాలు





కరీంనగర్-జనత న్యూస్ : పర్యాటక శోభ సంతరించుకుంది కరీంనగర్ దిగువ మానేరు ప్రాజెక్టు. ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24 టీఎంసీలు కాగా..ప్రస్తుతం పూర్తి స్థాయిలో నిండింది. జలాశయం నిండడంతో మిడ్ మానేరు ప్రాజెక్టు నుండి ఎల్ఎండీ లోకి వస్తున్న నీటిని దిగువకు వదులాల్సి వచ్చింది. దీంతో రిజర్వాయర్ వద్ద రెండు గేట్లు ఎత్తి మూడు వేల క్యూసెక్కుల నీటిని వదిలారు అధికారులు. మిడ్ మానేరు నుండి మూడు వేల క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి వస్తుండగా..దిగువ మానేరు ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా దిగువకు వదిలారు. దీంతో మానేరు ప్రాంతమంతా జలకళను సంతరించుకుంది. చాలా కాలం తరువాత గేట్లు ఎత్తివేయడంతో పర్యాటకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ దృష్యాలను చూసేందుకు ప్రజలు తరలి వెళ్తున్నారు. అయితే ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు పోలీసులు. రెవిన్యూ , పోలీస్ శాఖల అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. నదీ పరివాహక ప్రాంతం లోకి పశువులు , గొర్లు వెళ్లకుండా, ప్రమాదాలు జరగకుండా ప్రజలను అప్రమత్తం చేశారు.

## స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకుంటాం

### బీసీ గణన చేపట్టి ఎన్నికలకు వెళ్లే యోచనలో సర్కారు

### సీఎం ప్రకటన పట్ల కాంగ్రెస్ పార్లమెంటు ఇంఛార్జి వెలిచాల హర్షం



కరీంనగర్-జనత న్యూస్ : స్థానిక ఎన్నికల్లో కష్టపడి పని చేసిన కార్యకర్త లను గెలిపించుకుంటామన్నారు కాంగ్రెస్కరీంనగర్ పార్లమెంటు ఇంఛార్జి వెలిచాల రాజేందర్ రావు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రకటన విడుదల చేశారు. మూడు నెలల్లో బీసీల గణన చేపట్టి స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీఎం, టీపీసీసీ చీఫ్ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడి పనిచేసిన కార్యకర్తలను స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులుగా, ఎంపిటిసిలుగా, జడ్పిటిసిలుగా, ఎంపీపీలుగా, జడ్పీ చైర్మన్లుగా, మున్సిపల్ చైర్మన్ లుగా గెలిపించుకొని తీరుతామని స్పష్టం చేశారు. జనాభా పరంగా బీసీలకు దక్కాల్సిన వాటా అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నదని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలకులు బీసీలను ఏమాత్రం పట్టించుకోలేదని, వారికి తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. బీసీలను చీమను చూసినట్టు చూశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు సమా న్యాయం జరుగుతుందని చెప్పారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో రాహూల్ గాంధీ ని ప్రధాన మంత్రిని చేయడమే లక్ష్యంగా 24 గంటలు శ్రమిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటా తీసుకెళ్తామని వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు.

## నేడు ప్రజాపాలన దినోత్సవం



మొదటి పేజీ తరువాయి

గీతాలాపన అనంతరం మంత్రి శ్రీధర్ బాబు సందేశాన్ని ఇస్తారు. కాగా..రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ప్రజా పాలన దినోత్సవ వేడుకలు జరుగనున్నాయి. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు అధికారులు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జెండాను ఆవిష్కరించి ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. పలు పథకాల్లోని లబ్ధిదారులకు పత్రాలు అందజేయనున్నారు.

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

# విభిన్నం..వినూత్నం..
# లక్షలాది మందికి నేత్రానందం





## అన్ని దారులూ అటు వైపే..!

**ప్యారీస్ లేన్ గణ నాథున్ని దర్శించుకున్న భక్త జనం**

**ఒక్కో రోజు ఒక్కో రూపంలో ఆకట్టుకున్న ప్రదర్శనలు**

**యేదాది పొడవునా గుర్తుండే నవరాత్రులు**

**ఉమాపుత్ర ఉత్సవ కమిటీకి హ్యాట్సప్**

కరీంనగర్-జనత న్యూస్ : వినూత్నం..విభిన్నం..లక్షలాది మంది భక్తులను ఆకట్టుకున్న ఆ మండపమే ఓ అద్భుతం ! తొమ్మిది రోజులూ ఓ జాతరలా..పుణ్య క్షేత్రాన్ని తలపింప జేసింది. యేదాది పొడవునా కళ్ల ముందు సాక్షాత్కరించేలా ఈ నవరాత్రుల ప్రదర్శనలు నిలిచాయి. ఆధ్యాత్మిక, దైవ భక్తి ఉట్టిపడేలా భక్తులను కట్టి పడేశాయి. రాష్ట్రంలోనే అరుదైన మండపాల్లో ఒకటిగా ఇది నిలుస్తుందనడంలో అతియశోక్తి లేదు. కరీంనగర్ విద్యానగర్ ప్యారీస్ లేన్ గణేశ్ మండపం ప్రత్యేకతలు అన్నీ ఇన్నీ కావు. తొమ్మిది రోజులు ఇట్టే గడిచాయా..అన్నట్లుగా భక్తుల మనస్సులో నాటాయి. ఉమాపుత్ర ఉత్సవ కమిటీ ప్రతినిధుల సమైక్యత, ఆధ్మాతిక సేవను కొనియాడుతున్నారు భక్తజనం. గణ నాథున్ని అత్యంత భక్తి శ్రద్దలతో సాంప్రదాయ పద్దతిలో ఊరేగింపుగా నిమజ్జనం చేసిన తీరూ ప్రత్యేకమే !

కరీంనగర్ విద్యానగర్ ప్యారీస్ లేన్‌లోని గణేశ్ మండపం ఈ గణేశ్ నవరాత్రోత్సవాల్లో ఓ ప్రత్యేకతను చాటింది. తొమ్మిది రోజుల పాటు ఉమాపుత్ర ఉత్సవ కమిటీ చైర్మన్ కోటా సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు హైలైట్స్. ఇందులో భాగంగా శుక్రవారం కుభేర లక్ష్మి గణపతి రూపంలో గణ నాథున్ని అలంకరించారు. మూడు రోజుల పాటు ఈ ప్రదర్శన, గణ నాథున్ని చూసి తరించేందుకు తండోప తండాలుగా భక్తులు తరలి వచ్చారు. ఆదివారం ఒకే రోజు 50 వేలకు పైగా భక్తులు వచ్చి ప్రదర్శన, గణ నాథుని దర్శించుకోవడం విశేషం. సుమారు రూ. 35 లక్షల కొత్త కరెన్సీతో మండప ప్రాంతాన్ని అలంకరించి, అద్బుతమైన లైటింగ్ మధ్య భక్తులను విశేషంగా ఆకట్టుకునేలా తీర్చి దిద్దారు. మండపం నుండి ఫర్‌లాంగ్ వరకు ట్రాఫిక్ నిలిచి పోవడంతో ఇద్దరు ట్రాఫిక్ సీఐల పర్యవేక్షణలో పోలీసులు శ్రమ పడాల్సి వచ్చింది. ఇలా చివరి మూడు రోజులు ఎక్కువ సంఖ్యలో ఈ ప్యారీస్ లేన్ గణనాథున్ని దర్శించుకున్నారు.

**తొమ్మిది రోజులూ..నేత్రానందమే !**

ఈ నెల ఏడో తేదీ వినాయక చతుర్తి నుండి సోమవారం నిమజ్జనం రోజు వరకు..ప్రతీ రోజూ నేత్రానందమే. ఆధ్మాతిక సందేశాలు, కార్యక్రమాలు చేపట్టి ఆకట్టుకుంటున్నారు. మహా రుద్రాభిషేకం హైలైట్‌గా నిలిచింది. నేపాల్ ఖట్మండ్ సమీప ప్రాంతంలో తీసుకొచ్చిన రుద్రాక్షలతో పశుపతి లింగం, అమర్‌నాథ్ లోని మంచు శివలింగం, నవధాన్యాలతో గణపతి ప్రతిమ తయారు చేసి ప్రత్యేక పూజలు చేశారు. మరో రోజు శ్రీ కృష్ణ లీలలు ఆకట్టుకోగా..ఇక గణ నాథునికి నైవేద్యాలైతే ఔరా అనేలా నివేదించారు. మండపాన్ని సందర్శించిన వారిలో భక్తి భావం ఉట్టి పడేలా..మరిచి పోలేని మధురాను భూతిని కల్గించాయి ఇక్కడి దృష్యాలు.

**ఉమాపుత్ర ఉత్సవ కమిటీకి హ్యాట్సాప్**

నగరంలోని విద్యానగర్ ప్యారీస్ లేన్‌లో ఏర్పాటు చేసిన గణేష్ ప్రతిష్టా, నవరాత్రోత్సవాలు ఆద్యాంతం భక్తుల్లో ఆసక్తిని మరింత పెంచాయి. కోట సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ ఉత్సవాలు..ఎక్కడా భక్తులకు ఇబ్బందులు కలగకుండా జరిగాయి. కాలనీ వాసులు, కమిటీ సభ్యులు..చివరి వరకు ఎక్కడా తగ్గకుండా భక్తులకు సేవలందించారు. వాలంటీర్లు, వివిధ విభాగాల ప్రతినిధులు తమదైన శైలిలో ఉత్సహంగా వేడుకలను నిర్వహించారు. నిమజ్జనోత్సవాన్ని సైతం అత్యంత భక్తి శ్రద్దలతో విియ వంతం చేశారు.







## అత్యంత భక్తి శ్రద్దలతో నిమజ్జనోత్సవం..

మొదటి పేజీ తరువాయి

ఇందులో పాల్గొన్నారు. మానకొండూర్, కొత్తపల్లి చెరువు, చింతకుంట కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన భారీ క్రేన్ల ద్వారా నిమజ్జనం చేస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సీపీ అభిషేక్ మహంతి ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయగా..ఆయా శాఖల అధికారుల సమన్వయంతో మందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు అధికారులు. ఫైర్, గజ ఈతగాళ్లు, విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు.









## మౌలిక సౌకర్యాలు కల్పించాలి

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ



తంగళ్లపల్లి-జనత న్యూస్ : సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని కేసీఆర్ కాలనీలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝూఆదేశించారు. ఆ కాలనీని కలెక్టర్ సోమవారం ఉదయం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో మాట్లాడి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్మశాన వాటిక కోసం స్థలాన్ని గుర్తించాలని, నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తహసీల్దార్ జయంత్ ను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్ పాల్గొన్నారు.

## వినాయక యూత్ సభ్యులకు టీ షర్టుల పంపిణీ



హుజురాబాద్ సెప్టెంబరు 16 జనతా న్యూస్: హుజురాబాద్ మండలం చెల్పూర్ గ్రామానికి చెందిన గరుడ యూత్ సభ్యులకు అదే గ్రామానికి చెందిన అకినపల్లి డయానా - ఆకాష్ దంపతులు వినాయక నిమజ్జన ఉత్సవాన్ని పురస్కరించుకుని టీ షర్టులను సోమవారం అందజేశారు. సుమారు 15 వేల రూపాయల విలువ గల 30 టీ షర్టులను యూత్ సభ్యులకు వారు అందజేశారు. ఆకాష్, అక్షయ్, అరవింద్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవోపేతంగా గణేష్ శోభాయాత్ర నిర్వహణ

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**

**గణేశుని దయతో వరదల నుంచి బయటపడ్డాం**

**వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి**

**సజావుగా వినాయక నిమజ్జనం జరిగేలా నిర్వాహకులు సహకరించాలి**

**గణేష్ శోభాయాత్రను ప్రారంభించిన రాష్ట్ర మంత్రి**




ఖమ్మం, సెప్టెంబర్-16,జనతా న్యూస్: ఖమ్మం నగరంలో వినాయక నిమజ్జనం సందర్భంగా గణేష్ శోభాయాత్ర వైభవోపేతంగా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం ఖమ్మం నగరంలో వినాయక నిమజ్జనం సందర్భంగా గాంధీ చౌక్ వద్ద నుండి నిర్వహించే గణేష్ శోభా యాత్రను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ, ఖమ్మం పట్టణంలో శోభాయాత్ర నిర్వహణ సంతోషదాయకంగా, వైభవోపేతంగా జరగాలని, వినాయకుని నిమజ్జనం సజావుగా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. వినాయకుడి దయతో, కృపతో అనుకోని వరదలు వచ్చినప్పటికీ మనం బయట పడ్డామని, జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమీషనర్, ప్రజా ప్రతినిధులంతా క్షేత్ర స్థాయిలో ఉంటూ ప్రజల ప్రాణాలను రక్షించుకున్నామని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇంటింటికి ప్రభుత్వ సహాయం అందించి, ఖమ్మం పట్టణాన్ని యధావిధిగా పునరుద్ధరించడంలో కృషి చేసిన జిల్లా యంత్రాంగానికి, సహకరించిన ఖమ్మం ప్రజలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఖమ్మం ప్రజలు అందించిన స్ఫూర్తి , సహకారం, శక్తితో ఖమ్మం పట్టణ అభివృద్ధికి విగ్నేశ్వరుడి దయతో శాయశక్తుల కృషి చేస్తానని మంత్రి తెలిపారు. వినాయక చవితి ప్రకృతికి సంబంధించిన పండుగని, భవిష్యత్తులో ఉత్సవ కమిటీ సభ్యులు మట్టి వినాయకులకు ప్రాధాన్యత కల్పించాలని మంత్రి కోరారు. మట్టి వినాయకులను ప్రతిష్టించకపోతే నిమజ్జనానికి కూడా భవిష్యత్తులో ఉత్సవ కమిటీలు అనుమతించవద్దని, ప్రకృతి సంరక్షణలో గణేష్ ఉత్సవ కమిటీలు ముందుకు వచ్చి కఠినంగా ఉండాలని మంత్రి తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో బాలగంగాధర్ తిలక్ ప్రారంభించిన వినాయక చవితి వేడుకలు దేశ వ్యాప్తంగా విస్తరించాయని అన్నారు. సమాజంలోని పేదలు, మధ్యతరగతి, ఉన్నత వర్గాలకు చెందినవారు, అన్ని వర్గాల ప్రజలు చేసుకునే పండగ అని, దీనికి ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు ఘనంగా చేశామని అన్నారు. మన జీవన విధానం సజావుగా కొనసాగడానికి ఎటువంటి విఘ్నాలు, ఆటంకాలు కల్గకుండా ఉండాలని, సమాజం భారత దేశంగా ఉండాలని విఘ్నేశ్వరుని ప్రార్థిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గణేష్ శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని, ఈ కార్యక్రమాన్ని భక్తులు ప్రశాంతంగా సజావుగా జరుపుకోవాలని, ఎక్కడ ఎటువంటి పొరపాట్లు జరగవద్దని అన్నారు. సజావుగా వినాయక నిమజ్జనం నిర్వహించడంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు అధికారులకు, పోలీసులకు సహకారం అందించాలని మంత్రి సూచించారు. భవిష్యత్తులో గణేష్ శోభాయాత్ర మరింత ఘనంగా నిర్వహించేందుకు ఇంకా ఏమైనా ఏర్పాట్లు చేయాల్సి ఉన్న, సౌకర్యాలు కల్పించాల్సి ఉన్న ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఖమ్మం ప్రజలు ఎల్లప్పుడూ ఇదే విధంగా ఐక్యమత్యంతో అన్ని వర్గాల ప్రజలు ఉంటూ అభివృద్ధి సాధించాలని, మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ఇటీవల వచ్చిన భారీ వరదల నుంచి భగవంతుని ఆశీస్సులతో మన జిల్లా బయటపడిందని, వరదలు వచ్చిన సమయంలో బాధితులను ఆదుకునేందుకు క్షేత్రస్థాయిలో అందరం కలిసి పని చేశామని, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు క్షేత్రస్థాయిలో అందించిన సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ కొనియాడారు. విఘ్నాలు తొలగించే ఆ వినాయకుడుని ప్రజల జీవితాల్లో ఉన్న కష్టాలు, వరదల వల్ల వచ్చిన ఆపద నుంచి ప్రజలు పూర్తిస్థాయిలో బయటపడే విధంగా అనుగ్రహించాలని ప్రార్థిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం నిమజ్జనానికి గణేషులు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు డిసిపి ప్రసాద రావు, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## నిమజ్జనోత్సవం రోజు.. ఏరులై పారిన మద్యం



హుజురాబాద్ సెప్టెంబర్ 16 జనతా న్యూస్: గణేశ నిమజ్జన ఉత్సవ రోజైన సోమవారం నాడు హుజురాబాద్ పట్టణంతోపాటు సబ్ డివిజన్లోని అన్ని గ్రామాల్లో మద్యం ఏరులై పారింది. ఎక్సైజ్ అధికారులు మద్యం క్రయవిక్రయాలను చూసి చూడనట్టుగా వ్యవహరించారు. పెద్ద ఎత్తున అనధికారికంగా మద్యం విక్రయాలు జరిగాయి. బెల్ట్ షాపుల్లో యధావిధిగా మద్యం విక్రయించారు. అధికారులు నామ్ కే వాస్తే మద్యం షాపులు బంద్ అన్నట్టుగా వ్యవహరించారు. బ్రాందీ షాపుల వెనుక మార్గం కూడా విక్రయాలు జరిగాయి. దుకాణాల యజమానులే మద్యం విక్రయించడం గమనార్హం. అధిక ధరలకు విక్రయించి మద్యం వ్యాపారులు సొమ్ము చేసుకున్నారు. ఎక్సైజ్ అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. అధికారులు మద్య వ్యాపారులు కుమ్మక్కై ఈ తతంగాన్ని నడిపించారని పలువురు ఆరోపించారు.

## హుజురాబాద్‌లో.. ఘనంగా వినాయక నిమజ్జనం



హుజురాబాద్ సెప్టెంబర్ 16 జనతా న్యూస్: హుజురాబాద్ పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం వినాయక నిమజ్జనోత్సవం జరిగింది. ఐ యా వీధుల్లో, వార్డుల్లో పెద్ద ఎత్తున వివిధ సంఘాల ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ట్రాక్టర్లను వాహనాలను రంగురంగుల పూలతో అందంగా అలంకరించి గణేశ ప్రతిమలను ప్రతిష్టించారు. డబ్బు చప్పులతో, కోలాటాలతో, నృత్యాలతో వీధుల్లో గణేశా విగ్రహాలను ఊరేగించి ఆయా గ్రామాల్లో చెరువుల్లో, హుజురాబాద్ పట్టణంలో కాకతీయ కాలవలో నిమజ్జనం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ కార్యవర్గం చైర్మన్ గందే రాధిక శ్రీనివాస్ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేసింది. నిమజ్జనోత్సవ ప్రాంతాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. పెద్ద పెద్ద వినాయకులను కాలువలోదించేందుకు క్రేన్లను ఏర్పాటు చేశారు. దారి పొడవునా మహిళలు పిల్లలు మంగళహారతులతో గణేశ ప్రతిమలకు స్వాగతం పలికారు. గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ బుర్ర నటరాజ్ ఆధ్వర్యంలో స్వయం సేవకులు, కార్యకర్తలు విస్తృత ఏర్పాట్లు చేసి, నిర్వాహకులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణంలో పండగ వాతావరణం నెలకొంది.

## కేంద్ర మంత్రిని కలసిన పలు సంఘాల ప్రతినిధులు..



### చట్ట భద్దత పని విధానాలపై మెడికల్ రిప్స్..

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కోసం ఎస్జీటీల వినతి

కరీంనగర్-జనత న్యూస్ : దేశ వ్యాప్తంగా పని చేస్తున్న మెడికల్ సేల్స్ రిప్రజెంటీవ్స్‌కు చట్ట బద్దతమైన పని విధానాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు ఆ సంఘం ప్రతినిధులు. కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కేంద్ర ప్రభుత్వం 10 ఆగష్టు 2017 న కేవలం డ్రాఫ్ట్ రూల్స్ మాత్రమే రూపొందించిందని, డ్రాఫ్ట్ రూల్స్ పై తమ అభ్యంతరాలను తెలిపనప్పటికి సరిచేసి చట్టబద్దత కల్పించలేదని ఆందోళన వ్యక్తంచేశారు. 7 సంవత్సరాలు గడిచిన కేంద్ర ప్రభుత్వం మెడికల్ సేల్స్ రిప్స్ కి చట్టబద్ధమైన పనివిధానాలను రూపొందించక పోవడం వల్ల తాము నష్టపోతున్నట్లు తెలిపారు. సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్ 1976 ని ఉల్లంగిస్తున్న పార్మా యాజమాన్యలను శిక్షించాలని-కార్మిక చట్టాల సవరణ పేరుతో కార్మిక హక్కులను కాలరాసే 4 లేబర్ కోడ్స్ ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శులు విద్యాసాగర్, సదానంద చారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండా శ్రీనివాస్, కరీంనగర్ శాఖ అధ్యక్ష కార్యదర్శులు రమేష్. అంజయ్య, ఉపాధ్యకులు నరసింహా రెడ్డి, సహాయ కార్యదర్శులు నరేందర్, కోశాధికారి వెంకటేశ్వర్లు, సభ్యులు హరీష్, అంజి రెడ్డి పాల్గొన్నారు.

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కోసం..**

సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర శాఖ బాధ్యులు సోమవారం కరీంనగర్ పార్లమెంటు సభ్యులు, బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి , కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ను మర్యాద పూర్వకంగా కలిసి తమ సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్జిటి రాష్ట్ర అధ్యక్షులు కరివేద మహిపాల్ రెడ్డి , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం తమ సమస్యలు మంత్రికి వివరించారు. ఎస్జీటీల కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కు విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ సమస్య పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్జిటీ వ్యవస్థాపక అధ్యక్షులు మధుసూదనరావు , రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి , రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరాం శ్రీనివాస్ , ప్రవీణ్ , శ్రీధర్ రెడ్డి , శాంతి కిరణ్ , శశిధర్ లతోపాటు వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు విజేందర్ రెడ్డి , శేఖర్ గారు,మండల భాద్యులు పాల్గొన్నారు.



## నిర్ణీత సమయానికి విగ్రహాలను తరలించాలి

*భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేయాలి.. ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ*



సిరిసిల్ల-జనత న్యూస్ : నిర్ణీత సమయానికి విగ్రహాలను తరలించాలని వినాయక మండపాల నిర్వాహకులకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. సిరిసిల్లలోని మానేరు తీరంలో ఈ నెల 17న మంగళవారం వినాయక విగ్రహాల నిమజ్జనానికి చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ , ఇతర శాఖల అధికారులు సోమవారం పరిశీలించారు. తమ విగ్రహాలను భక్తిశ్రద్ధల మధ్య వేడుకలు నిర్వహిస్తూ వైభవంగా తరలించాలని వినాయక మంటపాల నిర్వాహకులకు సూచించారు. ప్రజా ప్రతినిధులు, యువత ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అధికారులు సూచించిన మేరకు సౌండ్ బాక్స్‌లను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్ళి, వేడుకలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరానికి స్పందన



సిరిసిల్ల-జనత న్యూస్ : సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీవై నగర్ లో గల షాదీకాన ఫంక్షన్ హాలులో హైదరాబాద్ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరానికి మంచి స్పందన వచ్చింది. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలోని వివిధ విభాగాలను కాంగ్రెస్ నియోజక వర్గ ఇంఛార్జి కేకే మహేందర్ రెడ్డి, నాగుల సత్యనారాయణ, చొప్పదండి ప్రకాశ్, గడ్డం నరసయ్యలు ప్రారంభించారు. 25 సంవత్సరాలు పైబడిన మహిళలకు, బ్రెస్ట్ క్యాన్సర్, నోటి క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ డిటెక్షన్ , మామోగ్రామ్ , (ఫైన్ నీడల్ ఆస్పిరేషన్ సైటోలజీ), సర్వైకల్ బయాప్సీ పరీక్షలు చేశారు. మహిళలలో తెల్లబట్ట, అధిక రక్తస్రావం, పొత్తికడుపులో నొప్పి, ఛాతీలో నొప్పి,చేతిలో గడ్డలు ఉన్నవారికి మందులు అందజేశారు. ఓపి 164 కాగా, 31 మందికి నోటి క్యాన్సర్ పరీక్షలు, 43 మంది మహిళలకు రొమ్ము క్యాన్సర్, 39 మందికి గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వసంతరావు , వేములవాడ ఏరియా హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ తిలక్ రాజ్ , డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ రజిత, ప్రోగ్రాం అధికారి డాక్టర్ నయీమ్ జహ, డాక్టర్ లక్ష్మీప్రసన్న, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సర్వేశ్వర్ ప్రసాద్, ప్రజా ప్రతినిధులు కాముని వనిత , పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీదేవి, మరియు , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రవక్త బోధనలు మానవాళికి దిక్సూచి

**మిలాద్-ఉన్-నబీని ఘనంగా జరుపుకోవాలి**

**కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జ్ వెలిచాల**



కరీంనగర్-జనత న్యూస్ : శాంతి, కరుణ, సోదరభావాన్ని చాటి చెప్పే మహమ్మద్ ప్రవక్త బోధనలు యావత్ మానవాళికి దిక్సూచి అని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. సోమవారం మహమ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్-ఉన్- నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం లకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మహమ్మద్ ప్రవక్త బోధించిన సబ్ర్ (సహనం), సిదక్ (సత్యనిష్ట), తహారత్ (పవిత్రత), జకాత్ (సహాయం), రహ్మ్ (దయ) అనే పంచ సూత్రాలు మానవీయ జీవితానికి బాటలు వేస్తాయని పేర్కొన్నారు. ప్రతీ ముస్లీం సోదరుడు ఆ ప్రవక్త సూచించిన సన్మార్గాలను పాటిస్తూ, పవిత్ర మిలాద్-ఉన్-నబీ పండగను ఇంటింటా భక్తిశ్రద్ధల మధ్య, ఆనందో త్సవాలతో జరుపుకోవాలని ఆయన సూచించారు. ప్రవక్త చెప్పిన శాంతి మార్గమే ప్రతి ఒక్కరికీ ఆచరణీయమని, వాటికి అనుగుణంగా ముందుకెళ్లాలని వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు.

## పిల్లల బాధ్యత తల్లిదండ్రులదే..

**సీపీ అనురాధ హెచ్చరిక**

**సరదాలు విషాదాలుగా మారొద్దని సూచన**



సిద్దిపేట,జనత న్యూస్: ప్రాజెక్టులు,చెరువులు,వాగులు,వంకలు పూర్తిస్థాయిలో నీళ్లతో నిండి ఉ ండడంతో పిల్లల బాధ్యత తల్లిదండ్రులదనని సీపీ అనురాధ సోమవారం హెచ్చరించారు. ఈత సరదాలు విషాదాలుగా మారకుండా తల్లిదండ్రులు తమ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాలని సీపీ అనురాధ సూచించారు.

మానేరు
# జనత
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

17.09.2024
మంగళవారం tuesday

సంపుటి (Volume): 09
సంచిక (Issue) : 157

పేజీలు : 8
Pages : 8

వెల: 2

Published from : Rangareddy, Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad,




4

## బంగ్లాతో సిరీస్ నుంచి పంత్ ఔట్

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్



# విపక్షాలు నన్ను హేళన చేశాయి

### పటేల్ గడ్డపై పుట్టిన బిడ్డగా అన్నీ భరించా: మోదీ

దేశంలో తొలి వందే మెట్రో రైలు ప్రారంభం

మోదీ స్ఫురించేలా 'నమో భారత్'గా పేరు మార్పు

ప్రారంభానికి కొన్ని గంటల ముందు మార్చిన రైల్వే

నాగపూర్-సికింద్రాబాద్, దుర్గ్-విశాఖ రూట్లలో 2 వందే భారత్ సహా 5 రైళ్లు ప్రారంభం



గాంధీనగర్, అహ్మదాబాద్, సెప్టెంబరు 16 : మనసునిండా ద్వేషం నింపుకొన్న కొందరు భారత్, గుజరాత్ ప్రతిష్ఠకు భంగం కలిగించే ఏ అవకాశాన్నీ వదిలిపెట్టడం లేదని ప్రధాని మోదీ విమర్శించారు. ఇలాంటి వ్యక్తులు దేశాన్ని చీల్చే ఎజెండాతో భారత సమగ్రత, ఐక్యతను లక్ష్యంగా చేసుకుంటున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల అమెరికా

మిగతా 2 లో

# మీ ఫామ్‌హౌజుల్లో జిల్లేళ్లు మొలిపిస్తా

### రాజీవ్ విగ్రహాన్ని తొలగించే దమ్ముందా

సచివాలయం ముందు కెసిఆర్ విగ్రహం పెట్టాలని చూశారు

రాజీవ్ లేకుంటే దేశంలో ఐటి ఎక్కడుండేది

పదేళ్లపాటు కుటుంబ పాలన చేసి..గాంధీలపై విమర్శలా

పదేళ్లపాటు తెలంగాణ తల్లి విగ్రహం ఎందుకు పెట్టలే

రాజీవ్ విగ్రహావిష్కరణ సభలో కెసిఆర్ కుటుంబపై సిఎం రేవంత్ ఫైర్



తెలంగాణ సచివాలయం ఎదుట సీఎం రేవంత్ రెడ్డి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి సుదీర్ఘంగా విమర్శలు చేశారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అని.. రాష్ట్రాన్ని కాపాడేది కూడా తామే అని రేవంత్ చెప్పారు.

జనతా న్యూస్: హైదరాబాద్ : రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే.. దాన్ని తీసేస్తామని బీఆర్ఎస్ నేతలు అనడంపై రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లుగా తెలంగాణ

మిగతా 2 లో

అక్టోబర్‌లో అర్హులందరికీ
## రేషన్ కార్డులు

విధివిధానాలు ఖరారు చేస్తున్న కేబినేట్ కమిటీ

వివరాలు వెల్లడించిన మంత్రి ఉత్తమ్ కుమార్



జనతా న్యూస్: హైదరాబాద్, : రేషన్ కార్డులు, హెల్త్ కార్డులపై తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. అక్టోబర్‌లో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్, హెల్త్ కార్డులు మంజూరు చేస్తామని ప్రకటించింది. సోమవారం

మిగతా 2 లో



40వేల మెగావాట్ల
## గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యం

2035 నాటికి చేరుకోవాలన్న పట్టుదల

గ్రీన్ పవర్ పెట్టుబడిదారుల సభలో భట్టి

గాంధీనగర్,సెప్టెంబర్16 : తెలంగాణ రాష్ట్రం 2035 నాటికి 40,000 మెగావాట్ల గ్రీన్ పవర్‌ను ఉత్పత్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సోలార్ పవర్‌తో నిరంతర విద్యుత్ లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. అలాగే రైతులకు సోలార్ పవర్ ద్వారా అందించే కార్యక్రమం చేపట్టామని అన్నారు. గుజరాత్ రాష్ట్రం గాంధీనగర్‌లోని మహాత్మా మందిర్ కన్వెన్షన్ అండ్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన ప్రారంభమైన నాలుగో ప్రపంచ గ్రీన్ పవర్ పెట్టుబడిదారుల

మిగతా 2 లో

# మహాగణపతి నిమజ్జనానికి భారీగా ఏర్పాట్లు

జీహెచ్‌ఎంసీ పరిధిలో 300కు పైగా క్రేన్‌లు ఏర్పాటు

ఖైరతాబాద్ వినాయకుడి వద్ద మంత్రి పొన్నం పూజలు

నిమజ్జన ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి

మహాగణపతి దర్శనాలు నిలిపివేతతో భక్తుల నిరాశ





హైదరాబాద్,సెప్టెంబర్16 : గణేశ్ నవరాత్రులు విజయవంతమయ్యాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సోమవారం ఆయన ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ..ప్రభుత్వం తరపున నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని.. మండపాలకు

మిగతా 2 లో



## తెలంగాణలో విద్యావ్యవస్థ రోజురోజుకు పతనం

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ

జనతా న్యూస్:హైదరాబాద్ : తెలంగాణలో విద్యావ్యవస్థ రోజురోజుకు పతనమవుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మితమవుతుందన్న మాటలకు అత్యంత ప్రాధాన్యమిచ్చిన కేసీఆర్ రాష్ట్రంలో విద్యావ్యవస్థ బలోపేతానికి అనేక చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల

మిగతా 2 లో

## నాపై హత్యాయత్నానికి కుట్ర



రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆరోపణలు

జనతా న్యూస్: హైదరాబాద్,సెప్టెంబర్16 :తెలంగాణ కోసం చావడానికైనా సిద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవని... తనపై జరిగిన దాడి

మిగతా 2 లో

## మజ్లిస్‌కు భయపడే విమోచనపై వెనకడుగు

కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ బండి సంజయ్



జనతా న్యూస్ కరీంనగర్ : మజ్లిస్‌కు భయపడి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ విమోచనను జరపడం లేదని కేంద్ర మంత్రి బండిసంజయ్ ఆరోపించారు. కెసిఆర్ తరహాలోనే రేంవత్ ప్రభుత్వం సాగుతోందన్నారు. తెలంగాణ

మిగతా 2 లో

# అక్టోబర్‌లో అర్హులందరికీ రేషన్ కార్డులు

మొదటి పేజీ తరువాయి

కేబినెట్ సబ్ కమిటీ భేటీ జరిగింది. అనంతరం మంత్రి ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కేబినెట్ సబ్ కమిటీ భేటీలో చర్చించిన విషయాలను మీడియాకు వెల్లడించారు.కొత్త రేషన్ కార్డు విధివిధానాలు రూపొందిస్తున్నామని మంత్రి ఉత్తమ్ చెప్పారు. తెల్ల రేషన్ కార్డు అర్హులు ఎవరనేదానిపై వచ్చే భేటీలో నిర్ణయిస్తామన్నారు. ఇతర రాష్ట్రాల్లో రేషన్ కార్డులు ఎలా ఇస్తున్నారనేదానిపై అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డుల నిబంధనలు ఎలా ఉండాలని పార్టీలకు లేఖ రాశామన్నారు.. కొంత మంది ప్రజాప్రతినిధులు విలువైన సూచనలు చేశారు. వచ్చిన సూచనలన్నీ సమావేశంలో చర్చించామని తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. అందరికి ఆరు కిలోల బియ్యం ఉచితంగా ఇస్తామన్నారు. గత ప్రభుత్వం 49 వేల రేషన్ కార్డులు మాత్రమే ఇచ్చింది..అవి కూడా బై ఎలక్షన్ వచ్చిన నియోజకవర్గాల్లోనే రేషన్ కార్డులు ఇచ్చారు. బీఆర్ఎస్ రాష్ట్రమంతా ఏ నాడు రేషన్ కార్డులు ఇవ్వలేదు . మేం పారదర్శకంగా రేషన్ కార్డులు జారీ చేస్తాం. సెప్టెంబర్ 21 నమరోసారి కేబినెట్ సబ్ కమిటీ భేటీ ఉంటుంది. ఈ నెలాఖరులోగా కేబినెట్ కమిటి రిపోర్ట్ ఇస్తుంది. అక్టోబర్ లో అర్హులైన అందరికీ కొత్త రేషన్ కార్డులు ఇస్తామని మంత్రులు వెల్లడించారు.

## 40వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

సభలో భట్టి పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో గ్రీన్ పవర్ ఉత్పత్తికి ఉన్న మార్గాలు.. రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వివరించారు. రాబోయే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సిటీ, ఫోర్త్ సిటీ, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌ను ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. ఇంటెలిజెన్స్ సిటీ, ఫ్యూచర్ సిటీ సుస్థిర సాంకేతికత చుట్టూ రాష్ట్రాభివృద్ధి కేంద్రీకృతమై ఉంది. కీలక పారిశ్రామిక కారిడార్లను అనుసంధానం చేయడానికి ప్రాంతీయ రింగ్ రోడ్డు, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌ను ముందుకు తీసుకెళ్లనున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో రెండు ప్రధాన హైడ్రో ప్రాజెక్టులు ఉన్నాయని, ఇక్కడ పంప్డ్ స్టోరేజ్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపట్టడానికి ఇంకా అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సోలార్ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపే వారంతా హైదరాబాద్‌కు రావాలని డిప్యూటీ సీఎం కోరారు.

## తెలంగాణలో విద్యావ్యవస్థ రోజురోజుకు పతనం

మొదటి పేజీ తరువాయి

బలోపేతానికి కృషి చేశారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు బాగా చదివి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలనే ఆలోచనతో పెద్ద సంఖ్యలో గురుకులాలను ఏర్పాటు చేశారు. ఇందుకోసం పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి ఆరోగ్యకరమైన వాతావరణంలో నాణ్యమైన విద్యను అందించారు. కానీ 9 నెలల మీ పాలన వల్ల ప్రభుత్వ విద్యావ్యవస్థ పతనావస్థకు చేరుకున్నది. పురుగులు లేని భోజనం కోసం, పాము కాట్లు, ఎలుక కాట్లు లేని వసతి కోసం, కనీస సౌకర్యాల కల్పన కోసం తరగతి గదుల్లో ఉండాల్సిన విద్యార్థులు రో÷-లడెక్కి నిరసనలు తెలియజేస్తున్నారు. ఒకవైపు టీచర్లు లేని కారణంగా బడులు మూతబడుతుంటే, మరోవైపు ప్రభుత్వ బడుల మీద విశ్వాసం సన్నగిల్లడంతో డ్రాపౌట్స్ పెరిగిపోతున్నాయి. మీ ప్రభుత్వ లెక్కలే ఈ వాస్తవాలను చెబుతున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో ఒక్క విద్యార్థి లేని పాఠశాలలు 1864 ఉంటే, 30లోపు విద్యార్థులున్న పాఠశాలలు 9,447 ఉన్నాయి. వందలోపు విద్యార్థులు మాత్రమే ఉన్న పాఠశాలలు 9,609. అంటే మీ 9 నెలల మీ పాలనలో మొత్తం 26,287 ప్రభుత్వ పాఠశాలలకు గాను దాదాపు 20వేల పాఠశాలల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. క గురుకులాల పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారింది. కేసీఆర్ గారి పాలనలో ఎవరెస్ట్ శిఖరమంత ఖ్యాతి గడించిన గురుకులాలు మీ పాలనలో సమస్యలకు నిలయాలుగా మారాయి. గురుకులాల దుస్థితి గురించి వార్తలు నిత్యకృత్యమైనా మీ ప్రభుత్వానికి పట్టింపులేదు. బిఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేండ్లలో కృషి చేసి పటిష్టపరిచిన గురుకులాలను మీ ప్రభుత్వం 9 నెలల్లోనే ధ్వంసం చేసింది. సంక్షేమ హాస్టళ్లను, సంక్షోభ హాస్టళ్లుగా మార్చింది. పరిశుభ్రత లోపించి మురుగు, చెత్త చెదారంతో నిండి కంపు కొడుతున్నాయి. పాఠశాల నుంచి కళాశాల వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇలా ఏ హాస్టల్ చూసినా దుర్భర పరిస్థితులే ఉన్నాయి. కుక్కకాటు, పాముకాటు, ఎలుక కాట్లతో విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతున్నారు. ప్రతి రోజూ ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాయి. ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటి వరకు 715 మందికి పైగా విద్యార్థులు ఆస్పత్రుల పాలు కాగా, 40పైగా మంది ప్రాణాలు కోల్పోయారు. అత్యంత బాధాకరమైన విషయం ఇది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయం అంటూ పేర్కొన్నారు.

## నాపై హత్యాయత్నానికి కుట్ర

మొదటి పేజీ తరువాయి

తర్వాత పరిణామాలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. తన హత్యకు కుట్ర జరుగుతుందన్న ఆయన.. తాము అధికారంలోకి వస్తే ఎవర్నీ విడిచిపెట్టేది లేదని వార్నింగ్ ఇచ్చారు. ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేయించానని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం చాలా దారుణమని అన్నారు. తెలంగాణ బీఆర్ఎస్ వర్సెస్ రేవంత్ రెడ్డి అన్నట్టు రాజకీయం నడుస్తోంది. కాంగ్రెస్ పార్టీ కంటే రేవంత్ రెడ్డిపైనే ఎక్కువ ఫోకస్ చేసి బీఆర్ఎస్ విమర్శలు చేస్తోంది. ఇప్పుడు ఏకంగా ఒక ఎమ్మెల్యేను చంపడానికే ఎ÷-లాన్ చేశారని తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు ఆ పార్టీ నేత కౌశిక్ రెడ్డి. దాదాపు వారం రోజు నుంచి సాగుతున్న హైడ్రామాలో మరోసారి కౌశిక్ రెడ్డి తీవ్ర కామెంట్స్ చేశారు. ఇది ఇప్పుడు మరోసారి తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయంశమయ్యాయి. కౌశిక్ రెడ్డి తన హత్య గురించే కాకుండా పీసీసీ చీఫ్ అయ్యేందుకు రేవంత్ రెడ్డి తన కాళ్లు పట్టుకున్నారని కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇలా రోజుకో రకంగా మాట్లాడుతూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారిపోతున్నారు. తెలంగాణ భవన్‌లో వివేక్‌తో కలిసి మీడియాతో మాట్లాడిన కౌశిక్ రెడ్డి తనను హత్య చేయడానికి మనుషులను పంపించినట్టు రేవంత్ రెడ్డే స్వయంగా ఒప్పుకున్నారని అన్నారు. దీనిపై డీజీపీ, హోంశాఖ సెక్రటరీ వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తులు కాల్స్ చేసి చంపేస్తామని బెదిరిస్తున్నారని కౌశిక్ రెడ్డి ఆరోపించారు తనకు ఏమైనా జరిగితే దానికి రేవంత్ రెడ్డే బాధ్యుడు అవుతారని హెచ్చరించారు. వందల మంది పోలీసులు సహకారంతోనే తనపై దాడికి యత్నించారన్నారు. తాను తెలంగాణ కోసం చావడానికైనా సిద్ధమని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అప్పుడు ఒక్కొక్కరి సంగతి చూస్తామని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి వీపు చింతపండు చేస్తారని ఆరోజులు దగ్గర్లోనే ఉందని అభిప్రాయపడ్డారు. పార్టీ మారిన వారిపై వేటు ఖాయమని ఆ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రాబోతున్నాయని అందులో కూడా బీఆర్ఎస్ జెండా ఎగురుతుందని అన్నారు. అధికార మదంతో రేవంత్ రెడ్డి విర్రవీగుతున్నారని అన్నారు కౌశిక్ రెడ్డి. తన కాళ్లు మొక్కితేనే రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ అయ్యారని అన్నారు. ఓటు నోటు కేసులో రేవంత్ రెడ్డి వీపు చింతపండు అయిందన్నారు. అన్నింటినీ మర్చిపోయి ఇప్పుడు కక్ష సాధింపులకు దిగుతున్నారని ఆరోపించారు. అన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని సరైన సమయంలో వాళ్లు రేవంత్‌కు బుద్ధి చెబుతారన్నారు.

## మజ్లిస్‌కు భయపడే విమోచనపై వెనకడుగు

మొదటి పేజీ తరువాయి

ఉద్యమం అంటే మజ్లిస్‌కు వ్యతిరేకమా అని అన్నారు. అసలు రజాకార్ల పార్టీయే మజ్లిస్ అని అన్నారు. కరీంనగర్ జిల్లాలో పర్యటించిన కేంద్ర మంత్రి బండిసంజయ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణేశ్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి.. హిందువుల పండుగులకే ఆంక్షలు, బంధనలు ఎందుకు అని ప్రశ్నించారు. సెప్టెంబరు 17వ తేదీన నరేంద్ర మోడి పుట్టినరోజు దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలలో జరుపుకోవాలన్నారు. సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవం.. తెలంగాణకి స్వాతంత్య్రం వచ్చినరోజు అన్నారు. రజాకార్ల అరచకాలని మనం ఎప్పుడూ మరిచిపోలేం.. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్.. ఇప్పుడు కాంగ్రెస్ కూడా తెలంగాణ విమోచన దినోత్సవం జరుపడం లేదని విమర్శించారు. ఎంఐఎం పార్టీకి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు భయపడి సెప్టెంబర్ 17ని జరపడం లేదన్నారు. వీరుల బలిదానాలని, త్యాగాలని బీఆర్ఎస్, కాంగ్రెస్ మరిచిపోతున్నాయని బండి సంజయ్ అన్నారు. ఇక, అసదుద్దీన్ ఓవైసీ పేదల గొంతుక ఎలా అవుతాడని రేవంత్ రెడ్డిని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఎవరికి సేవ చేసాడు, ఓవైసీ కాలేజీని హైడ్రా ఎప్పుడు కూల్చుతుంది అని అడిగారు.

# విపక్షాలు నన్ను హేళన చేశాయి



మొదటి పేజీ తరువాయి

పర్యటనలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించే మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. నేషనల్ కాన్ఫరెన్స్‌తో కాంగ్రెస్ పొత్తుపెట్టుకున్న నేపథ్యంలో జమ్మూ కశ్మీర్‌లో మళ్లీ 370 ఆర్టికల్‌ను తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని.. ఆ రాష్ట్రంపై రెండు రాజ్యాంగాలు, రెండు చట్టాలు రుద్దాలని అనుకుంటున్నారని మోదీ తీవ్ర విమర్శలు చేశారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సోమవారం దేశంలో మొట్టమొదటిసారిగా 'వందే మెట్రో రైలు' ను మోదీ ప్రారంభించారు.అందుకు కొన్ని గంటల ముందు ఈ రైలు పేరును 'నమో భారత్ ర్యాపిడ్ రైలు'గా రైల్వేశాఖ అధికారులు మార్చారు. ఈ రైల్‌తో పాటు ఐదు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు సహా రూ.8వేల కోట్ల విలువైన పలు ప్రాజెక్టులను మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో దుర్గ్-విశాఖపట్నం, నాగపూర్-సికింద్రాబాద్ వందేభారత్ రైళ్లు ఉన్నాయి. అనంతరం మెట్రో రైల్లో మోదీ ప్రయాణించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో.. ఆ తర్వాత గాంధీనగర్‌లో ప్రపంచ పునరుత్పాదక ఇంధన పెట్టుబడిదారుల సదస్సులోనూ మోదీ ప్రసంగించారు. మూడోసారి ప్రధాని అయ్యాక తనను రకరకాల మాటలతో విపక్షాలు అవమానించాయని.. ద్వేషాన్ని వెళ్లగక్కాయని, ఎగతాళి చేశాయని, అయినా సర్దార్ పటేల్ గడ్డ మీద జన్మించిన బిడ్డగా ఆ అవమానాలన్నీ తాను భరించి మౌనంగా ఉన్నానని పేర్కొన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చాక ఈ వందరోజుల్లో అభివృద్ధి పనుల పరంగా నిర్దేశించుకున్న ఎజెండాను వేగంగా పూర్తిచేశానని చెప్పారు. తన జీవితం ప్రజల కోసమేనన్నారు. "నేను కష్టపడితే ఆ కష్టం మీ కోసం.. నేను త్యాగం చేస్తే ఆ త్యాగమూ మీ కోసమే" అని వ్యాఖ్యానించారు. వచ్చే 25 ఏళ్లలో భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. వచ్చే వెయ్యేళ్ల కోసం అభివృద్ధి పరంగా భారత్ పునాదులు వేస్తోందని.. ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలబడటంతో పాటు ఆ స్థానాన్ని నిలబెట్టుకోవడమూ మనకు ప్రధానం అని అన్నారు.21వ శతాబ్దం మీద చరిత్ర లిఖిస్తే గనక అందులో సౌరశక్తిలో భారత విప్లవం మీద ప్రత్యేక అధ్యాయం ఉంటుందన్నారు. మూడోసారి అ౭ధికారంలోకి వచ్చిన ఈ వంద రోజుల్లో తమ సర్కారు ప్రతి రంగంలో పురోగతికి ప్రయత్నించిందన్నారు. అయోధ్యతో పాటు మరో 16 నగరాలను 'మోడల్ సోలార్ సిటీస్'గా అభివృద్ధి చేసే పనిలో కేంద్ర ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. గుజరాత్‌లోని వవోల్ ప్రాంతంలో 'ఉచిత సౌర విద్యుత్తు' లబ్ధిదారులతో మోదీ మాట్లాడారు.

### 'నమో..' భారత్

నరేంద్ర మోదీ! ఈ పేరు పొడి అక్షరాల్లో రాస్తే నమో! మోదీ పేరును స్ఫురించే విధంగా ఓ రైలుకు పేరు పెట్టేసింది రైల్వేశాఖ. వాస్తవానికి గుజరాత్‌లోని భుజ్-అహ్మదాబాద్ మధ్య ప్రారంభించిన రైలుకు తొలుత అనుకున్న పేరు 'వందే మెట్రో'! సోమవారం ఈ రైలును ప్రారంభించే కొన్ని గంటల ముందు రైల్వేశాఖ పేరు మార్చేసింది. 'నమో భారత్ ర్యాపిడ్ రైలు' అని పేరు పెట్టింది. అహ్మదాబాద్ నుంచి ప్రధాని మోదీ వం-ˆ్చువల్‌గా జెండా ఊపడంతో భుజ్ రైల్వే స్టేషన్ నుంచి సోమవారం 4:15 గంటలకు అహ్మదాబాద్ దిశగా ఈ రైలు పరుగుతీసింది. 'నమో భారత్ ర్యాపిడ్ రైలు' భుజ్-అహ్మదాబాద్ మధ్య తొమ్మిది స్టేషన్లను కవర్ చేస్తూ 5:45 గంటల్లో 359 కి.మీ దూరం ప్రయాణిస్తుంది.

# రాజీవ్ విగ్రహాన్ని తొలగించే దమ్ముందా



మొదటి పేజీ తరువాయి

తల్లి విగ్రహం పెట్టకుండా పామ్‌హౌజ్‌లు, ప్రగతిభవన్‌లు, కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టులు కట్టుకున్నారని మండిపడ్డారు. అలాంటి వారు ఇవాళ తెలంగాణ తల్లి గురించి మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. ఆ గాడిదలకు బుద్ధి లేదు.. రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ముట్టి చూడండి బిడ్డా.. ఎవడు వస్తాడో రండి.. నేను చూస్తా. రాజీవ్ గాంధీ విగ్రహం సాక్షిగా నేను ప్రతిజ్ఞ చేస్తున్నా. తెలంగాణ తల్లి విగ్రహాన్ని దేశం అబ్బురపడే రీతిలో మేం ప్రతిష్ఠ చేస్తాం. డిసెంబర్9న తెలంగాణ ప్రకటన వచ్చిన రోజుకు గుర్తుగా సచివాలయంలో ప్రతిష్టామని అన్నారు. అలాగే కొండా లక్ష్మణ్ బాపూజీ లాంటి మహనీయులకి విలువ ఇవ్వని సన్నాసి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్. కేసీఆర్, ఆయన కొడుకు కెటిఆర్ తెగించి దోచుకున్నారు. ఆ కాలకేయ ముఠా, మిడతల దండు నుంచి తెలంగాణను కాపాడుకుందాం అని రేవంత్ సంచలనంగా విమర్శలు చేశారు. కేసీఆర్, కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు లక్ష్యంగా రేవంత్ రెడ్డి తీవ్రంగా, ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. ట్విటర్ పిట్ట అయిన కేటీఆర్ కు కంప్యూటర్ తెచ్చిందే రాజీవ్ గాంధీ కదా. లేకపోతే గుంటూరులో ఇడ్లీ, వడ అమ్ముకునే వాడు. కేటీఆర్ ఐటీ శాఖ మంత్రి అయ్యాడు అంటే అది రాజీవ్‌గాంధీ చలవే. పదవులు, ప్రాణత్యాగం అంటే గాంధీ కుటుంబం మాత్రమే గుర్తుకు వస్తుంది. కేటీఆర్ అయ్య ముఖ్యమంత్రి.. కేసీఆర్ కొడుకు మంత్రి.. అల్లుడు హరీశ్ రావు ఇరిగేషన్ మంత్రి, ఒకరు రాజ్యసభ, మరొకరు ఎమ్మెల్సీ. ఇలా కటుఉంబ పాలన చేసిన వారు గాంధీ కుటుంబ పాలన గురించా మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. కేసీఆర్ వేల ఎకరాల్లో ఫామ్ హౌస్ కట్టిండు. అలాంటిది తెలంగాణ తల్లి విగ్రహం పెట్టడానికి పదేళ్లు సరిపోలేదా? మీ ఫామ్ హౌస్‌లలో జిల్లేడు మొలిపిస్తా.. అలాగే తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయం లోపల పెట్టిస్తున్నం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వార్నింగ్ ఇచ్చారు. అలాగే చాకలి ఐలమ్మ పేరుతో మహిళా యూనివర్సిటీ, సురవరం ప్రతాపరెడ్డి పేరుతో తెలుగు వర్సిటీకి పేరు పెట్టుకోబోతున్నామని అన్నారు. ఐదేళ్లు మహిళకు మంత్రి వర్గంలో చోటు ఇవ్వని సన్నాసులకు మహిళా అభివృద్ధి గురించి ఏం తెలుస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. రాజీవ్ గాంధీ తెచ్చిన కంప్యూటర్ పరిజ్ఞానంతోనే అమెరికా వెళ్లి జాబ్ చేశావు.. ఐటీ మంత్రి అయ్యావ్, లేకపోతే కేటీఆర్ మంత్రి దరిద్రం ఉండేది కాదు అని విమర్శించారు. లేకపోతే గుంటూరులో చాయ్, టిఫిన్స్ అమ్ముకుంటూ ఉండేవాడివి.. సిద్దిపేటలో ఛాయ్ అమ-్మకుంటూ ఉండేటోడివి అంటూ ఎద్దేవా చేశారు. ఎంత బలుపు మాటలు.. అధికారం పోయిన మదం తగ్గలేదని కేటీఆర్ పై ధ్వజమెత్తారు. త్యాగాలు అంటే నెహ్రూ, ఇందిరమ్మ, రాజీవ్ కుటుంబాలవేనని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గాడిదలకు ఏం తెలుసు గంధపు చెక్కల వాసన అని దుయ్యబట్టారు. మీ ఫామ్ హౌజ్‌లలో జిలలెళ్లు మొలిపిస్తానని చురకలు అంటించారు. రాజీవ్ గాంధీ విగ్రహం సాక్షిగా కాంగ్రెస్ కార్యకర్తలకు చెబుతున్నా.. వెయ్యి ఎకరాల్లో తండ్రి ఫామ్ హౌజ్ కట్టించుకున్నాడు.. కొడుకు వంద ఎకరాల్లో జన్వాడలో ఫామ్ హౌజ్ కట్టించుకున్నాడని అన్నారు. సొంత విగ్రహం పెట్టుకునేందుకు సెక్రటేరియట్ ముందు స్థలాన్ని పెట్టుకున్నాడు అని తెలిపారు. 'ఎవడొస్తాడో రండిరా.. టైమ్ చెప్పండి.. ఎవడు వస్తాడో చూస్తా.. తెలంగాణ ఇచ్చింది మేము.. తెలంగాణ తెచ్చింది మేము? సెక్రటేరియట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టేది మేము..' అని అన్నారు. బీఆర్ఎస్ ఏర్పాటుకు స్థలాన్ని ఇచ్చిన కొండా లక్ష్మణ్ బాపూజీ చనిపోతే కేసీఆర్ కుటుంబం ఒక్కరు కూడా హాజరు కాలేదని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్‌కు రెగ్యులర్‌గా షాక్ ట్రీట్మెంట్ జరుగుతుంది.. అర్థం కావడానికి కొంత సమయం పడుతుందని విమర్శించారు. కాలకేయ ముఠా గ్రామాల మీద పడుతుంది.. కొంతమంది మిడతల దండును మన ప్రజల మీదకు ఉసి గొల్పుతున్నరు.. కాంగ్రెస్ కార్యకర్తలు ఆ మిడతల దండును తరిమికొట్టాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశ ప్రజల కోసమే రాజీవ్ గాంధీ ప్రధాని పదవి చేపట్టాం ˆని, ప్రజలకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రానికి గ్రామాలే పట్టుకొమ్మలని మహాత్మా గాంధీ అన్నారు. గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసిన నేత రాజీవ్ గాంధీ. 72,73వ రాజ్యాంగ సవరణ ద్వారా నేరుగా గ్రామాలకు నిధులు కేటాయించారు. ఆడబిడ్డలకు రాజ్యాధికారం ఇచ్చారు. ఐటీ రంగాన్ని దేశానికి పరిచయం చేశారు త్యాగం అంటే ఏంటో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత తనపై ఉంది. రూ.వేల కోట్ల సంపదను దేశం కోసం త్యాగం చేసిన నాయకుడు, స్వాతంత్య్రం కోసం జైలుకు వెళ్లిన వ్యక్తి, స్వాతంత్య్రం తర్వాత దేశాన్ని ఐక్యంగా ఉంచిన నేత నెహ్రూ. ఆయన కట్టిన ప్రాజెక్టులు ఇప్పటికీ ఆయన పనితనానికి సజీవ సాక్ష్యాలుగా ఉన్నాయి. నెహ్రూ అధికారంలో ఉన్నప్పుడు ఇందిరా గాంధీ ఏ బాధ్యతా తీసుకోలేదు. కొందరు మాత్రం తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని మంత్రి పదువులు పొందుతున్నారు. బ్యాంకులను ప్రభుత్వపరం చేసి పేదలకు ఇందిరా గాంధీ మంచి చేశారు. లక్షల ఎకరాల భూములను పేదలకు పంచి పెట్టింది ఇందిరా గాంధీ కాదా? దేశంలో రిజర్వేషన్లు తెచ్చింది కాంగ్రెస్ పార్టీ కాదా?'అని అన్నారు. రాజీవ్ గాంధీ తర్వాత సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఏ పదవీ తీసుకోలేదు. పదవి త్యాగం అంటే వాళ్లవి. తెలంగాణ బిడ్డ పీవీని ప్రధానిని చేసింది సోనియా గాంధీ కాదా?గాంధీ కుటుంబం గురించి కేసీఆర్ కుటుంబానికి తెలుసా? అడ్డగోలుగా మాట్లాడితే చూస్తూ ఊరుకుంటామనుకున్నారా?గత పాలకులు సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహం పెడదామనుకున్నారట. పదేళ్లలో ఎందుకు పెట్టలేదు?'అని సీఎం ప్రశ్నించారు. డిసెంబర్ 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, సీతక్క, కొండా సురేఖ,దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

# గణెశిశ్ నిమజ్జనానికి భారీగా ఏర్పాట్లు

మొదటి పేజీ తరువాయి

ఉచిత విద్యుత్ సౌకర్యం ఇచ్చినట్లు చెప్పారు. నిమజ్జనం కోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ట్యాంక్ బండ్ చుట్టూ 135, మొత్తం జీహెచ్ఎంసీ పరిధిలో 300కు పైగా క్రేన్‌లు అందుబాటులో ఉంటాయని వివరించారు. నిమజ్జన ఉత్సవాలకు ప్రజలు సహకరించాలని కోరారు. వీలైనంత వరకు మంగళవారం రాత్రి లోపు నిమజ్జన కార్యక్రమాలు పూర్తి చేయాలని భావిస్తున్నట్లు పొన్నం ప్రభాకర్ చెప్పారు. హైదరాబాద్ జంట నగరాలకు సంబంధించి గణెశిష్ నిమజ్జనం కోసం ఏర్పాట్లు పూర్తి చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. మహాగణపతి నిమజ్జనం కోసం జరుగుతున్న ఏర్పాట్లు పొన్నం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొదటిసారి మండపాలకు ఉచిత విద్యుత్ ఇచ్చామని తెలిపారు. శాంతియుతంగా భక్తి శ్రద్ధలతో నిర్వాహకులు పూజ కార్యక్రమాలు చేశారన్నారు. మంగళవారం నిమజ్జన ఘట్టమని.. భక్తులు శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. 360 క్రేన్లు హైదరాబాద్ మొత్తం ఏర్పాటు చేశామని తెలిపారు. మొబైల్ క్రేన్లు కూడా ఉన్నాయన్నారు. అవసరమైన ప్రాంతాలకు తరలించడానికి ప్రత్యేక అధికారులు ఉన్నారని చెప్పారు. ఎక్కడైనా ఏమైనా ఇబ్బంది వస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. మంగళవారం ఉదయం ఖైరతాబాద్ వినాయకుడి శోభాయాత్ర ప్రారంభం అవుతుందని.. ఇప్పటికే పనులు జరుగుతున్నాయన్నారు. సమయానికి నిమజ్జనం పూర్తి చేయడానికి అందరూ సహకరించాలని కోరారు. ఎల్లుండి వర్కింగ్ డే అని ఆలోపు నిమజ్జనం పూర్తి చేసుకుంటే ప్రజలకు ఇబ్బందులు ఉండవని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మధ్యాహ్నం మహాగణపతి గంగమ్మ ఒడికి చేరనున్నారు. నిమజ్జనం ఏర్పాట్లలో భాగంగా ఈరోజు ఉదయం ఖైరతాబాద్ గణనాథుడి వద్ద కర్ర తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే మహాగణపతి వద్దకు శోభాయాత్ర ట్రక్కు చేరుకుంది. సోమవారం బడా గణెశిష్ దర్శనానికి భక్తులకు అనుమతి నిరాకరించారు. నాలుగు వైపులా బారికేడ్లను పోలీసులు ఏర్పాటు చేశారు. దర్శనం నిలిపివేత విషయం తెలియక బడా గణెశిష్ వద్దకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. అనుమతి లేకపోవడంతో భక్తులు నిరాశగా వెను తిరిగారు. మరోవైపు ట్యాంగ్‌బండ్ వద్ద గణెశిష్ నిమజ్జన కార్యక్రమం కొనసాగుతోంది. హుస్సేన్ సాగర్ చుట్టూ భారీగా క్రేన్లు ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ఎ÷-లాజా, జలవిహార్, బేబీ వాటర్ పాండ్ వద్ద క్రేన్లు ఏర్పాటు చేశారు. హుస్సేన్ సాగర్ చుట్టూ మొ?త్తంగా 31 క్రేన్లు ఏర్పాటు అయ్యాయి. క్రేన్ నంబర్ 4 వద్ద ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం జరుగనుంది.

## హోటల్ గదిలో నర్సింగ్ విద్యార్థిని మృతి

**అనుమానాస్పదంగా ఆత్మహత్య**

**కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

హైదరాబాద్,సెప్టెంబర్ 16 : గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. చిన్న అంజయ్యనగర్‌లోని ఓ హోటల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన విద్యార్థిని (23). హైదరాబాద్‌లో గణేశ్ వేడుకలను చూసేందుకు రెండు రోజుల క్రితం ముగ్గురు స్నేహితులతో కలిసి ఆమె నగరానికి వచ్చారు. వీరిలో ఓ యువతి, మరో ఇద్దరు యువకులు ఉన్నారు. వీరంతా చిన్న అంజయ్యనగర్‌లోని హోటల్‌లో దిగారు.ఆదివారం రాత్రి భోజనం ముగించుకుని స్నేహితులు బయటకు వెళ్లారు. తనకు తలనొప్పిగా ఉందని విద్యార్థిని వారి వెంట వెళ్లకుండా హోటల్ గదిలోనే ఉండిపోయింది. సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు స్నేహితులు తిరిగి వచ్చారు. గదికి లోపలి నుంచి గడియ వేసుకుని ఎంతకీ తీయలేదు. హోటల్ సిబ్బందికి చెప్పడంతో వారు మాస్టర్ కీతో తలుపు తీశారు. విద్యార్థిని లోపల ఫ్యానుకు ఉరివేసుకుని మృతిచెందినట్లు గుర్తించారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. తమ కుమార్తెపై అత్యాచారం చేసి హత్య చేశారని విద్యార్థిని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. దీనిపై గచ్చిబౌలి పోలీసులకు వారు ఫిర్యాదు చేశారు. తన కుమార్తె మృతిపై అనుమానాలున్నాయని యువతి తండ్రి తెలిపారు. ఆమె ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని చెప్పారు. ఆమె స్నేహితులు, హోటల్ సిబ్బందిపై అనుమానం వ్యక్తం చేశారు.

## గతంలో ఐటీతో దేశంలో విప్లవాత్మక మార్పులు

**ఇప్పుడు గ్రీన్ ఎనర్జీ రివల్యూషన్ దిశగా అడుగులు**

**గాంధీనగర్ ఎనర్జీ ఇన్వెస్టర్స్ మీట్‌లో చంద్రబాబు**

గాంధీనగర్,సెప్టెంబర్ 16 : ఆర్థిక సంస్కరణలకు ముందు వృద్ధిరేటు సాధారణంగా ఉండేదని, 1991లో సంస్కరణలు వచ్చిన తర్వాత విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో నిర్వహించిన రెన్యువబుల్ ఎనర్జీ ఇన్వెస్టర్స్ మీట్‌లో ఆయన మాట్లాడారు. ప్రతి నలుగురు ఐటీ నిపుణుల్లో ఒక భారత్ వాసి ఉంటున్నారని, ప్రతి నలుగురు భారత్ ఐటీ నిపుణుల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఒక వ్యక్తి ఉంటున్నారని చెప్పారు. గతంలో ఐటీ ప్రవేశపెట్టి నప్పుడు విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఇప్పుడు గ్రీన్ ఎనర్జీ రెవెల్యూషన్ మొదలైంది. గతంలో విద్యుత్ కోతలు తీవ్రంగా ఉండేవి. ఇవాళ విద్యుత్ రంగంలో గణనీయమైన సంస్కరణలు వచ్చాయి. 2014లో రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్ ప్రవేశపెట్టాం. విద్యుత్ బిల్లుల కట్టడికి ఆర్‌ఈతో పాటు కటింగ్ ఎడ్జ్ సాంకేతికత వాడాలి. గ్రిడ్ నిర్వహణకు సమతూకానికి విద్యుత్ రవాణా వ్యవస్థ మెరుగు పర్చాలి. క్లీన్ ఎనర్జీ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయి. క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్‌ను ప్రమోట్ చేయాల్సి ఉంది. గ్రిడ్ నిర్వహణకు సమతూకానికి విద్యుత్ రవాణా వ్యవస్థ మెరుగు పర్చాలి. గ్రీన్ ఎనర్జీ కారిడార్లను సరిగా నిర్వహించాల్సి ఉంది. గ్రీన్ హైడ్రోజన్ హబ్‌ల ద్వారా నేరుగా ట్రాన్స్‌మిషన్ చేయాలని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో ఉత్తమ పారిశ్రామిక విధానాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. తద్వారా ఏపీకి పలు ప్రాజెక్టులు సాధించినట్లు గుర్తు చేశారు. క్లీన్ ఎనర్జీ నాలెడ్జ్, నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉంది. క్లీన్ ఎనర్జీ సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సి ఉంది. నెడ్ క్యాప్ నోడల్ ఏజెన్సీగా పని చేస్తుంది. ఏపీలో విన్-విన్ర్ విధానంలో భూ సమీకరణ జరుగుతుందని చంద్రబాబు తెలిపారు.

## రివర్స్ టెండరింగ్ విధానం రద్దు

**జీవో నంబరు 67ను రద్దు చేస్తూ ఉత్తర్వులు**

అమరావతి,సెప్టెంబర్ 16 : వైకాపా ప్రభుత్వ పాలనలో అమల్లోకి తెచ్చిన రివర్స్ టెండరింగ్ విధానం రద్దు చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వం జారీ చేసిన రివర్స్ టెండర్ జీవో నంబరు 67ను రద్దు చేస్తున్నట్లుగా పేర్కొంటూ ఉత్తర్వులు ఇచ్చింది. 2019లో జగన్ ప్రభుత్వం తెచ్చిన రివర్స్ టెండరింగ్ విధానాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. రివర్స్ టెండరింగ్ స్థానంలో పాత సంప్రదాయ టెండరింగ్ విధానం అమల్లోకి తెస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వ పనులకు ఇక నుంచి పాత టెండర్ విధానాన్ని అనుసరించాలని జీవోలో స్పష్టం చేసింది.

## గవర్నమెంట్ స్కూళ్లలో సీబీఎస్ఈ రద్దు దుర్మార్గం

**చంద్రబాబు తీరుపై మండిపడ్డ జగన్**

అమరావతి,సెప్టెంబర్ 16 : గవర్నమెంట్ స్కూళ్లలో సీబీఎస్ఈ రద్దుతో మీరు మరోసారి పేదల వ్యతిరేకి అని సీఎం చంద్రబాబు నిరూపించుకున్నారని జగన్ విమర్శలు గుప్పించారు. తద్వారా నాణ్యమైన విద్యకు గండికొడుతున్నారని విమర్శించారు. తిరోగమన నిర్ణయాలతో ప్రభుత్వస్కూళ్లను మళ్లీ మొదటికే తీసుకెళున్నారని ఆరోపించారు. మీ ఇళ్లల్లో పిల్లలకు అత్యుత్తమ చదువులు అందించాలనుకుంటారు కానీ, గవర్నమెంటు స్కూలు పిల్లల విషయంలో వివక్ష ఎందుకు? వాళ్లు ఎప్పటికీ కింద స్థాయిలోనే ఉండిపోవాలా? వారి జీవితాలకు మీరు శాపంపెట్టిన మాదిరిగా ఈ నిర్ణయాలు ఏంటి? అంటూ ప్రశ్నించారు. దశాబ్దాలుగా ఎవరూ పట్టించుకోకపోవడంతో గవర్నమెంటు స్కూళ్ల రూపురేఖలు మార్చే కార్యక్రమాలను రద్దుచేయడం ఎంతవరకు సమంజసమని ఎక్స్(ట్విట్టర్) వేదికగా ప్రశ్నలు గుప్పించారు. ముఖ్యమంత్రిగా 14 ఏళ్లకాలంలో చేయలేని పనులన్నీ ఐదేళ్లలో వైయస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిందన్నారు. నాడు-నేడు, ఇంగ్లీషు మీడియం, సీబీఎస్ఈ, ఐబీ వైపు అడుగులు, టోఫెల్, సబ్జెక్టు టీచర్ల కాన్సెప్ట్, తరగతి గదుల్లో 6వ తరగతి నుంచి ఇంటరాక్టివ్ ఎ÷-లాట్ పానల్స్, 8వ తరగతి వచ్చే సరికే ట్యాబుల పంపిణీ, విద్యాకానుక, రోజుకో మెనూతో గోరుముద్ద? ఇలా పేద పిల్లల తలరాతలను మార్చే చదువులను అందించడానికి వైయస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను తీసుకువచ్చిందన్నారు. ఇప్పుడు ఒక్కొక్కటిగా వీటిని రద్దుచేస్తూ వస్తున్నారని అన్నారు. గవర్నమెంటు స్కూళ్ల పిల్లలను ప్రైవేటు బాట పట్టించడానికి కుట్రను అమలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తమ పిల్లలకు మంచి చదువులు అందించడం కోసం తల్లిదండ్రులు వారి సొంతజేబు నుంచి ఎందుకు ఖర్చుచేయాలని ప్రశ్నించారు. గవర్నమెంటు స్కూలు పిల్లలు, అందులో పనిచేస్తున్న ఉపాధ్యాయులు దేంట్లోనూ తక్కువ కాదని ఆయన అన్నారు. వీళ్లంతా తెలివైన వారు అని తెలిపారు. పైగా ప్రభుత్వ టీచర్లు లక్షలమంది పోటీపడే పరీక్షల్లో ఉత్తీర్ణులై, చక్కటి శిక్షణకూడా పొందినవారు ఉన్నారన్నారు. ప్రైవేటు స్కూళ్లలో ఉన్నవారికంటే గొప్పచదువులు చదివినవారు, గొప్పగా చదువులు చెప్పగలిగినవారు ఉన్నారని వెల్లడించారు. అలాంటి వారిని తక్కువగా చూసే మీ మనస్తత్వాన్ని ముందు మార్చుకోండి అంటూ పేర్కొన్నారు. పిల్లలకు కావాల్సింది వారిలో ఆత్మవిశ్వాసం నింపడం, సరైన శిక్షణ, పటిష్ట బోధన. టీచర్లకు అందించాల్సింది ప్రేరణ, ప్రోత్సాహం, ఓరియంటేషన్ అని జగన్ చెప్పుకొచ్చారు. గడచిన ఐదేళ్లలో ఈ దిశగా వారు ఎంతో ప్రయాణం చేశారని తెలిపారు.

# ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు

**రేవంత్‌ను కలిసి చెక్కు అందించిన చిరంజీవి**







హైదరాబాద్,సెప్టెంబర్ 16 : వరద బాధితుల సహాయార్థం పలువురు ప్రముఖులు సాయం అందజేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి ప్రముఖ నటుడు చిరంజీవి రూ. 50 లక్షలు విరాళం ఇచ్చారు. రామ్ చరణ్ తరఫున మరో రూ.50లక్షలు అందజేశారు. ఈమేరకు సీఎం రేవంత్‌ను కలిసి చెక్కులను ఇచ్చారు. అమర్ రాజా గ్రూప్ తరఫున సీఎం సహాయనిధికి మాజీమంత్రి గల్లా అరుణ కుమారి రూ.కోటి విరాళం, సినీ నటులు అలీ రూ.3 లక్షలు, విశ్వక్ సేన్ రూ.10లక్షలు అందజేశారు. సినీ నటుడు సాయిధరమ్ తేజ్ రూ.10 లక్షలు, గరుడపల్లి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్ సంజయ్ గరుడపల్లి రూ.25 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా ఇచ్చారు.

## కన్నుల పండువగా గణేష్ నిమజ్జోత్సవం..



**ప్రత్యేకంగా అలంకరించిన రథాల్లో వినాయకుల ఊరేగింపు**

**కోలాటాలు, భజనలతో భక్తులు**

**డ్యాన్స్ చేసిన చిన్నారులు**

**నవరాత్రుల లడ్డూలకు భళే డిమాండ్**

కమలాపూర్, జనతా న్యూస్ : వినాయక విగ్రహాల నిమజ్జోత్సవం హనుమకొండ జిల్లా వ్యాప్తంగా శోభాయంగా సాగింది.వినాయక విగ్రహాల నిమర్జనం పురస్కరించుకొని భక్త భజన మండలి ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో గణపతూలను ప్రధాన రహదారి వెంట ఊరేగింపుగా తీసుకెళ్లి నవరాత్రులు పూజించిన వినాయకులను స్థానిక చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు. కమలాపూర్ మండలంలో నిమజ్జన ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగాయి. నిమజ్జనంలో భాగంగా మహిళలు కోలాట ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ ముందుకు సాగగా చిన్న పిల్లలు భక్తి పాటలకు భజనలు చేస్తూ ద్యాన్సులు చేస్తూ ఉత్సాహంతో ముందుకు సాగారు. గణపతి బొప్పా మోరియా నినాదాలతో హోరెత్తించి బొజ్జ గణపయ్యను గంగమ్మ ఒడికి చేర్చారు. నవరాత్రులు పూజించిన గణపతి లడ్డులను భక్తులు వేల రూపాయలకు వేలం పాటలో సొంతం చేసుకొని గణపయ్యను భక్తిశ్రద్ధలతో కొలిచారు.

**నిమజ్జనానికి తరలిన..ఎమ్మెల్యే కార్యాలయ గణపతి**

తిమ్మాపూర్,జనత న్యూస్: మానకొండూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పది రోజులుగా పూజలందుకున్న గణనాథుడు నిమజ్జనానికి సోమవారం తరలివెళ్లాడు. ఈ సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పర్యావరణాన్ని దృష్టి ఉంచుకొని వినాయక చవితి పండగ మట్టి విగ్రహాన్ని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే.పూజ అనంతరం క్యాంపు కార్యాలయం నుంచి అల్గునూరు,సదాశివపల్లి మీదుగా మానకొండూర్ చెరువు వరకు శోభాయాత్ర సాగింది.అనంతరం గణపతి మహారాజ్ కి జై అంటూ జైజై నినాదాల మధ్య గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.ఈ శోభాయాత్రలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఇంచార్జీ గోపు మల్లారెడ్డి, ఎమ్మెల్యే సహాయకులు మంచాల మహేందర్,పలకల శ్రీనివాస్ రెడ్డి,అజయ్ కార్యాలయ సిబ్బంది కిషన్ రెడ్డి,వాసాల తిరుపతి, పాశం లావణ్య,సంతోషి, దివ్య,రాజేశ్వరి, లక్ష్మి,లక్ష్మణ్, శివ,శ్రీనివాస్,పార్టీ నాయకులు కనకం కుమార్,ఆశిక్ పాషా,రెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

## రిమ్స్ డైరెక్టర్ కు గణేష్ ప్రసాదం అందజేత



జనతా న్యూస్ : ఆదిలాబాద్: ఆదిలాబాద్ పట్టణంలోని రామ్ నగర్ కాలనీ 11వ వార్డులో ఏర్పాటు చేసిన చంద్ర గణేష్ మండల్ ప్రసాదాన్ని రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ జయసింగ్ రాథోడ్ కు మండల్ సభ్యులు సామనపల్లి రామన్న, కదం నరేష్ అందజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ 9 రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన గణేష్ ప్రసాదాన్ని తనకు అందజేయడం సంతోషంగా ఉందని చెప్పారు. రాంనగర్ కాలనీకి చెందిన చంద్ర గణేష్ మండల్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పీఏ అశ్విన్ కుమార్ తదితరులు ఉన్నారు.

## గణేశ్ మండపంలో విషాదం

**గుండెపోటుతో టెక్కీ మృతి**

హైదరాబాద్,సెప్టెంబర్ 16 : హైదరాబాద్‌లోని మణికొండ పరిధి అలకాపురి టౌన్‌షిప్‌లో విషాదం చోటుచేసుకుంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ శ్యామ్ ప్రసాద్ గుండెపోటుతో మృతిచెందారు. టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన గణేశ్ ఉత్సవ కమిటీ లడ్డూ వేలం పాటలో ఉత్సాహంగా పాల్గొన్న అతడు.. ఇంటికి వెళ్లి ఒక్కసారిగా కుప్పకూలి మరణించారు. ఆదివారం రాత్రి గణేశ్ మండపం వద్ద శ్యామ్ ఉత్సాహంగా లడ్డూ వేలంలో పాల్గొన్నారు. చాలాసేపు నృత్యాలు చేస్తూ గడిపారు. రూ.15లక్షల వరకు వేలంలో పాల్గొన్నారు. ఆ తర్వాత స్నేహితుడు లడ్డూ కైవసం చేసుకోవడంతో అతడి ముందు ఉత్సాహంగా తీన్మార్ స్టెప్పులేశారు. అనంతరం ఇంటికి వెళ్లి కుప్పకూలి చనిపోయారు. దీంతో కుటుంబసభ్యులు, కాలనీవాసులు విషాదంలో మునిగిపోయారు.

## ప్రజా పాలన దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి..

**జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**




జగిత్యాల,జనత న్యూస్: ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తెలిపారు.సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రజా పాలన దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నేడు అధికారికంగా ప్రజా పాలన దినోత్సవాన్ని నిర్వహించడానికి ఆదేశాలు జారీ చేసిందని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పతాకావిష్కరణ చేయాలని తెలిపారు. మొదటగా జాతీయ గీతం ఆలపించి అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు,రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ముఖ్య అతిథి ప్రసంగిస్తారని తెలిపారు. ఉదయం 10 గంటలోగా ఉద్యోగులు అందరూ కార్యాలయానికి హాజరు కావాలని పేర్కొన్నారు.ప్రోటోకాల్,షామియా మొదలగు వాటికి సంబంధించినవి చూసుకోవాలని ఆర్డీఓలకు కలెక్టర్ సూచించారు. అంబులెన్స్, ప్రథమ చికిత్స కు సంబంధించిన మందులు కానీ, ఓ. ఆర్. స్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని వైద్య అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతిలో పంచాయతీ సెక్రటరీలు జెండా ఎగురేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి సమస్యలు రాకూడదని, వస్తే వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. అంతకు ముందు కలెక్టరేట్ పరిసరాలను కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు పి. రాంబాబు,గౌతం రెడ్డి,జగిత్యాల,మెట్ పల్లి ఆర్డీఓలు మధు సుధన్,శ్రీనివాస్,డిఎస్పీ రఘు చందర్, కలెక్టరేట్ ఏఓ హన్మంత రావు, జిల్లా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కోమటి చెరువును సందర్శించిన డీసీపీ..

**నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన**

సిద్దిపేట,జనత న్యూస్: పట్టణంలో వినాయక నిమజ్జనం నిర్వహించనున్న కోమటి చెరువును సోమవారం డీసీపీ మల్లారెడ్డి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి మాట్లాడుతూ వినాయక నిమజ్జనం సందర్భంగా కోమటి చెరువు చుట్టూ బారికేటింగ్, లైటింగ్, పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టం, ఎంట్రీ/ఎగ్జిట్, ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా మున్సిపల్ అధికారులతో కలిసి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. వినాయక మండపాల ఆర్గనైజర్లు కార్యవర్గ సభ్యులు గణేష్ ఉత్సవ కమిటీ మెంబర్లు పోలీసుల సూచనలు సలహాలు పాటిస్తూ వినాయక శోభయాత్రను భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించుకుంటూ ముందుకు సాగుతూ నిమజ్జన కార్యక్రమం నిర్వహించుకోవాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమానికి వీక్షించడానికి వచ్చే ప్రజలు ట్రాఫిక్ పోలీసులు చూపించిన ప్రాంతాలలో వాహనాలు పార్కు చేసుకొని నిమజ్జన కార్యక్రమాన్ని వీక్షించాలని సూచించారు. చివరి వినాయకుడు నిమజ్జనం అయ్యేంతవరకు ప్రతి ఒక్క డిపార్ట్మెంట్ అధికారులు ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఏసీబీ మధు,మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్,వన్ టౌన్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ బాబు,మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు వివిధ డిపార్ట్మెంట్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉదయమే పర్మిట్ రూమ్‌లు తెరవద్దు

**మందుబాబులకు వార్నింగ్ ఇచ్చిన ఎమ్మెల్యే**

నల్గొండ,సెప్టెంబర్ 16 : మందు బాబులపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయమే పర్మిట్ రూమ్‌లకు అనుమతించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం మునుగోడు పట్టణంలోని పలు వైన్ షాపుల్లో స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పర్మిట్ రూమ్‌ల్లో మద్యం తాగుతున్న మందు బాబులతో ఎమ్మెల్యే కోమటిరెడ్డి మాట్లాడారు. ఉదయాన్నే ఇలా మందుకు బానిస అయి వైన్ షాపులకు వస్తే.. కుటుంబ పరిస్థితి ఏమిటంటూ వారిని ఈ సందర్భంగా ఆయన ప్రశ్నించారు. దీంతో వారంతా మౌనంగా ఉండిపోయారు. దీంతో మద్యం తాగుతున్న వారిని పర్మిట్ రూమ్‌ల నుంచి బయటకు పంపేశారు.



# బంగ్లాతో సిరీస్ నుంచి పంత్ ఔట్


టీమ్ ఇండియా రెడ్ బాల్ క్రికెట్ సీజన్ ఇంకా ప్రారంభం కాలేదు. కానీ, దులీప్ ట్రోఫీ 2024 ఉత్సాహం దేశీయ క్రికెట్‌లో కొనసాగుతోంది. ఇందులో జాతీయ జట్టులోని చాలా మంది ఆటగాళ్ళు కూడా తమ బలాన్ని ప్రదర్శిస్తున్నారు. టోర్నీ రెండో రౌండ్‌లో కూడా కొంతమంది ఆటగాళ్లు మంచి ప్రదర్శన చేశారు. ఇందులో వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ ఇషాన్ కిషన్ పేరు కూడా ఉంది. అతను భారత్ %దీ% కి వ్యతిరేకంగా మొదటి ఇన్నింగ్స్‌లో అద్భుతమైన సెంచరీతో ఆకట్టుకున్నాడు. దానికి అతను బహుమతిని కూడా పొందవచ్చు అని చెబుతున్నారు. ఇషాన్ కిషన్ గత కొన్ని నెలలుగా భారత జట్టుకు దూరంగా ఉన్నాడు. అతను %దీజజ×% సెంట్రల్ కాంట్రాక్ట్‌లో కూడా భాగం కాదు. వాస్తవానికి, అతను బీసీసీఐ అడిగిన తర్వాత కూడా దేశవాళీ క్రికెట్‌లో ఆడటానికి నిరాకరించాడు. అందుకే అతను ఇవన్నీ ఎదుర్కోవలసి వచ్చింది. అయితే, ఇషాన్ ఇప్పుడు మళ్లీ జట్టులోకి రావడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాడు. దులీప్ ట్రోఫీకి ముందు బుచ్చిబాబు టోర్నీలో కూడా సెంచరీ చేశాడు. గాయం కారణంగా దులీప్ ట్రోఫీ మొదటి రౌండ్‌లో అతను పాల్గొనలేకపోయాడు. కానీ, రెండో రౌండ్‌లో అతను 111 పరుగులతో మంచి ఇన్నింగ్స్ ఆడాడు. %ూ×% నివేదికలను విశ్వసిస్తే, అక్టోబర్‌లో బంగ్లాదేశ్‌తో జరగనున్న మూడు మ్యాచ్‌ల %ు%20 సిరీస్‌కు టీమ్ ఇండియా జట్టులో ఇషాన్ చోటు సంపాదించవచ్చు. అయితే ఈ సిరీస్‌లో రిషబ్ పంత్‌కు విశ్రాంతి లభిస్తేనే ఇది సాధ్యమవుతుంది. టీ20 ప్రపంచకప్‌లో కూడా పంత్ అత్యుత్తమ ఫామ్‌లో కనిపించలేదు. శ్రీలంకతో జరిగిన టీ20 సిరీస్‌లో అతని బ్యాట్ నుంచి పెద్ద ఇన్నింగ్స్‌లు లేవు. బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్ తర్వాత అతనికి విశ్రాంతి ఇవ్వవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో అతని స్థానంలో ఇషాన్ టీ20 జట్టులోకి రావచ్చు అని తెలుస్తోంది. ఈ సిరీస్ అక్టోబర్ 6 నుంచి 12 వరకు జరగనుంది. అదే సమయంలో, నివేదికలను విశ్వసిస్తే, ఈ టీ20 సిరీస్‌లో శుభమాన్ గిల్‌కు కూడా విశ్రాంతి తీసుకోవచ్చని తెలుస్తోంది. వీరితో పాటు, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌లకు కూడా భారత టెస్టు క్రికెట్‌లో బిజీ షెడ్యూల్ కారణంగా విశ్రాంతి ఇవ్వవచ్చు అని వస్తున్నాయి.



## నా తండ్రిక్రికెట్ ఫ్యాన్: మోర్నే మోర్కెల్

సౌతాఫ్రికా క్రికెట్ టీమ్‌లో కీలక ప్లేయర్‌గా చాలా పేరు తెచ్చుకున్న మోర్నే మోర్కెల్, ఇప్పుడు టీమిండియాకు బౌలింగ్ కోచ్‌గా నియమితులయ్యాడు. ఇది చాలా మంచి పొజిషన్ అని చెప్పుకోవచ్చు.
దీన్ని సాధించిన తర్వాత అతని ఎంతో సంతోషించారు. అంతేకాదు ఎవరినీ కలవకుండా, చివరికి తన భార్యను కూడా కలవకుండా ఒకరిని కలిశారు. ఆయన మరెవరో కాదు అతడి తండ్రి. ఈ కొత్త పదవి గురించి తన తండ్రితో ఎంతో ఆనందంగా, గర్వంగా ఉన్నట్లు చెప్పాడట. ఈ పెద్ద బాధ్యత తనకు ఎంతో ప్రత్యేకమని తెలిపినట్లు పేర్కొన్నాడు. సెప్టెంబర్ 1 నుంచి తన కొత్త పదవిని చేపట్టారు. ఇంతకు ముందు ఆటగాడిగా 12 ఏళ్లు దక్షిణాఫ్రికా జట్టుకు ఆడి, మూడు రకాల క్రికెట్‌లో కలిపి 544 వికెట్లు పడవేశారు. "టెస్ట్ మ్యాచ్‌ల కోసం టీమిండియాకు బౌలింగ్ కోచ్‌గా నేను నియమితులయ్యాను. ఈ విషయం తెలిసిన వెంటనే నేను మొదట నా తండ్రికి ఫోన్ చేశాను. నా భార్యకు కాదు. ఎందుకంటే, నా తండ్రిక్రికెట్ ఫ్యాన్. ఈ పదవి నాకు చాలా ప్రత్యేకమని చెప్పాను. నాకు ఈ పదవి దక్కడం చాలా ఆనందంగా ఉంది. నా కుటుంబంతో కలిసి ఈ ఆనందాన్ని పంచుకున్నాను." అని మోర్నే మోర్కెల్ వెల్లడించాడు. మోర్కెల్ తన కొత్త పొజిషన్‌లో కొనసాగుతూనే తన సహచరులతో మంచి సంబంధం ఏర్పరుచుకోవాలని కోరుకుంటున్నాడు. "నేను టీమిండియాలో కొత్తగా చేరినందున, జట్టులోని అందరితో స్నేహం చేయాలని ఆశిస్తున్నా. ఇంతకు ముందు చాలా మంది భారతీయ ఆటగాళ్లతో ఆడాను. ఇప్పుడు వారితో కలిసి ప్రాక్టీస్ చేయడం, స్నేహం చేయడం నాకు చాలా ఆనందంగా ఉంది." అని అన్నాడు.మోర్కెల్ ఇప్పుడు భారత క్రికెట్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా ఉన్నారు. ఆయనకు ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టులో గౌతమ్ గంభీర్‌తో కలిసి ఆడారు. ఆ తర్వాత లక్నో సూపర్ జెయింట్స్ ( టీమ్‌కు కోచింగ్ చేశారు. అంటే వీళ్ళిద్దరూ చాలా కాలంగా కలిసి పని చేస్తున్నారు. ఆ పరిచయంతోనే తన దగ్గరకు మోర్కెల్ ను తీసుకొచ్చాడు. ఈ ప్లేయర్ గతంలో పాకిస్తాన్ జట్టుకు కూడా కోచ్‌గా పనిచేశారు. ఇప్పుడు భారత జట్టుకు కోచ్‌గా వచ్చారు. అంటే అతను చాలా దేశాల క్రికెట్ జట్లకు కోచ్‌గా పనిచేసిన అనుభవం ఉన్న వ్యక్తి.

## వివాహ బంధంతో ఒక్కటైన నటుడు సిద్దార్థ్ , నటి అదితిరావు హైదరీ



నటుడు సిద్దార్థ్ , నటి అదితిరావు హైదరీ తాజాగా వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో వనపర్తిలోని దేవాలయంలో వీరి వివాహం జరిగింది. దీనికి సంబంధించిన ఫొటోలను సోషల్‌మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. నువ్వే నా సూర్యుడు.. నువ్వే నా చంద్రుడు.. అలాగే నువ్వే నా తారాలోకం. మిసెస్ అండ్ మిస్టర్ అదు సిద్ధు' అని అదితి క్యాప్షన్ జత చేశారు. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. నూతన జంటకు నెటిజన్లు శుభాకాంక్షలు చెబుతున్నారు. సిద్దార్థ్‌తో రిలేషన్ గురించి అదితి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. 'మహా సముద్రం' షూట్‌లో తమ మధ్య పరిచయం ఏర్పడిందన్నారు. కొంతకాలానికి అది స్నేహంగా మారిందన్నారు. తనకెంతో ఇష్టమైన ప్రదేశంలో సిద్దార్థ్ తనకు ప్రపోజ్ చేశాడని చెప్పారు. మా నాన్నమ్మ అంటే నాకెంతో ఇష్టం. హైదరాబాద్‌లో ఆమె ఒక స్కూల్ ప్రారంభించారు. అది నాకెంతో ప్రత్యేకం. నా చిన్ననాటి రోజులు అక్కడే ఎక్కువగా గడిపా. కొన్నేళ్లక్రితం ఆమె కన్నుమూశారు. ఈ విషయం సిద్దార్థ్‌కు తెలుసు. ఓ రోజు నా వద్దకువచ్చి.. ఆ స్కూల్‌కు తీసుకువెళ్లమని అడిగాడు. మార్చిలో మేమిద్దరం అక్కడికి వెళ్లాం. మోకాళ్లపై కూర్చొని.. అతను నాకు ప్రపోజ్ చేశాడు. ఆమె ఆశీస్సుల కోసమే తాను అక్కడ ప్రపోజ్ చేసినట్లు చెప్పాడని అదితి చెప్పారు.
అయితే సిద్దార్థ్ గతంలోనే పెళ్లి చేసుకోగా..అతనికిది రెండో వివాహం.



## జాన్వీ.. ఇది బిగ్గెస్ట్ టాస్క్

అలనాటి నటి శ్రీదేవి వారసురాలిగా హీరోయిన్ జాన్వీ కపూర్.. సినీ ఇండస్ట్రీలోకి ఇప్పటికే ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. వైవిధ్యమైన కథలు ఎంచుకుంటూ మంచి పేరు సంపాదించుకుంది. తనదైన అందం, గ్లామర్ ను సొంతం చేసుకుని.. చిత్ర పరిశ్రమలో సూపర్ క్రేజ్ దక్కించుకుంది. ఇప్పటికే బాలీవుడ్ లో పలు సినిమాల్లో యాక్ట్ చేసిన అమ్మడు.. త్వరలో టాలీవుడ్ లోకి అడుగు పెట్టనుంది. అప్పుడు శ్రీదేవి సీనియర్ ఎన్టీఆర్ తో నటిస్తే.. ఇప్పుడు జూనియర్ ఎన్టీఆర్ మూవీతో తెలుగులోకి ఎంట్రీ ఇవ్వనుంది జాన్వీ కపూర్. మాస్ డైరెక్టర్ కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న దేవర పార్ట్-1తో టాలీవుడ్ సినీ ప్రియులను పలకరించనుంది. సినిమాలో తంగం పాత్ర పోషిస్తోంది జాన్వీ. అచ్చ పల్లెటూరి అమ్మాయిగా సందడి చేయనుంది. డెబ్యూ మూవీతో తెలుగులో మంచి హిట్ అందుకోవాలని చూస్తోంది అమ్మడు. అయితే జాన్వీ.. తెలుగు ఎంట్రీ విషయంలో భారీ సవాళ్లు ఎదుర్కోనుందని అంతా చెబుతున్నారు. శ్రీదేవికి ఫ్యాన్ బేస్ వేరే లెవెల్ లో ఉండేది. కాబట్టి.. ఇప్పుడు వారసురాలిపై కచ్చితంగా ఒత్తిడి ఉంటుందని అంచనా వేస్తున్నారు. దానికి తోడు ఎన్టీఆర్.. యాక్టింగ్, డ్యాన్స్ గురించి తెలిసిందే. దీంతో ఆయన రేంజ్ కు తగ్గట్టు ఆమె ప్రెజెన్స్ ఉండాలని అంటున్నారు. భారీ బడ్జెట్ తో రూపొందనున్న మూవీ.. కనుక ఆమె హీరోయిన్ గా కచ్చితంగా మెప్పించాల్సి ఉంటుందని కామెంట్లు పెడుతున్నారు. కాగా, దేవరలో ఆమె రోల్.. రూరల్ రస్టిక్ గా ఉండనున్నట్లు ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ ద్వారా క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్. గతంలో వచ్చిన రంగస్థలంలో సమంత, పుష్పలో రష్మిక పాత్రలు కూడా అలాంటివే. వాళ్లిద్దరూ తమ తమ పాత్రల్లో ఒదిగిపోయారు. కానీ ఇప్పటి వరకు దేవర మేకర్స్ రిలీజ్ చేసిన లుక్స్ లో జాన్వీ తన పాత్రలో ఒదిగి పోయినట్లు కనిపించడం లేదని చెబుతున్నారు. అదే సమయంలో ట్రైలర్, పోస్టర్స్ బట్టి క్లారిటీ ఇవ్వలేమని అంటున్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com